ఇమామ్, మౌజన్ల వేతనాలు మంజూరు

ఆక్వా రైతులకు లైసెన్సు తప్పనిసరి

గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి : నెల్లూరు ఆర్డీవో అనూష

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- పూర్తి వివరాలు 8లో..



నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు వద్దనున్న 2/3 సచివాలయంలో 11.04 గంటలకు అడ్మిన్, వెల్ఫేర్, ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీలు తప్ప ఎవరూ లేరు. అదేమని అడిగితే కొందరు ఇన్‌చార్జిలుగానూ, ఎడ్యుకేషన్ సెక్రటరీ సెలవులోనూ ఉన్నారని, ఇన్‌చార్జిలుగా ఉన్నవారు అవసరమైనప్పుడు వస్తారని తెలిపారు. అలాగే, జాతీయరహదారికి అనుకుని పద్మావతి గ్రీన్‌సిటీలో ఉన్న 13/1 సచివాలయాన్ని 11.48 గంటల సమయంలో సందర్శించగా ఎడ్యుకేషన్ సెక్రటరీ, ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ మాత్రమే ఉన్నారు. అడ్మిన్, వెల్ఫేర్ సెక్రటరీలు వీఆర్ స్కూల్లో టీచర్లుగా వెళ్తున్నారని, మిగిలిన వారు సర్వేల కోసం వెళ్లారని తెలిపారు. దీంతో సచివాలయం ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. ఇదే ప్రాంతంలోని 13/2 సచివాలయంలోనూ ఇద్దరు ఉద్యోగులు మాత్రమే కనిపించారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



ఉదయగిరి సచివాలయం-2లో ఈ ఇద్దరే దిక్కు

ఆరుగురికి ఇద్దరు

ప్రతి సచివాలయంలో విధుల్లో ఉండాల్సిన సిబ్బంది 11 మంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన రేషనలైజేషన్‌లో 6 నుంచి 8 మందిని మాత్రమే నియమించారు. మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే, ఉన్న సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేయాల్సిన సచివాలయ వ్యవస్థ జిల్లాలో పూర్తిగా గాడితప్పింది. పర్యవేక్షణ అధికారులు పత్తాలేకుండాపోవడంతో సిబ్బందిదే ఇష్టారాజ్యమైంది. సర్వేల పేరిట ఫీల్డ్ విజిట్ అంటూ బయటకు వెళ్లిపోతున్న వారంతా తిరిగి కార్యాలయాలకు ఎప్పుడొస్తారో తెలియదు. వివిధ పనుల కోసం సచివాలయాలకు వస్తున్న ప్రజలు విసిగి వేశారి ఇళ్లకు తిరుగుముఖం పడుతున్నారు.నెల్లూరులోని పలు ప్రాంతాలలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఆకస్మిక విజిట్‌లో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఆంధ్రజ్యోతి పరిశీలన



అనంతసాగరం : సిబ్బంది లేక ఖాళీగా కుర్చీలు



కావలి రూరల్ : కొత్తపల్లి సచివాలయంలో విధుల్లో ఉన్న సిబ్బంది

- సచివాలయాల్లో ఇదీ పరిస్థితి
- కొందరిది కాలక్షేపం.. ఇంకొందరిది పలాయన మంత్రం
- ప్రజలకు అందని ప్రభుత్వ సేవలు

నెల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఉత్తమ సేవలందించాలనే ఉద్దేశంతో ఏర్పడిన సచివాలయాల వ్యవస్థ ఆశించిన స్థాయిలో పని చేయడం లేదు. కొంతమంది కార్యదర్శులు కష్టించి పనిచేస్తున్నా, ఇంకొందరికి అసలు పనే ఉండటం లేదు. మరి కొందరేమో పేరుకే సచివాలయ కార్యదర్శులు. కానీ ఎప్పుడూ సచివాలయాల మొహం చూడటం లేదు. పట్టణాల్లో మున్సిపల్ అధికారులు, మండలాల్లో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మెడికల్ ఆఫీసర్లు వారిని సచివాలయాల గడప తొక్కనివ్వకుండా తమ కార్యాలయాలకు రప్పించుకొంటున్నారు. ఫలితంగా సచివాలయాలు కొందరు కార్యదర్శులకు కాలక్షేప కేంద్రాలుగా, మరి కొందరికి అతిథి గృహాలుగా మారిపోయాయి.

- వీరే దిక్కు..

ప్రతి సచివాలయంలో ఎవరున్నా లేకున్నా కార్యాలయానికి అతుక్కొని కనిపించే కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు. సచివాలయానికి వచ్చే ప్రజలకు వీరే జవాబు దారీగా ఉండాలి. కానీ వీరికి నిమిషం తీరిక ఉండటం లేదు. ఎందుకంటే కీలక శాఖలకు చెందిన పలువురు కార్యదర్శులు సచివాలయాల్లో లేరు. వీరిని వీరి శాఖాధిపతులు సచివాలయంలో ఉండనివ్వడం లేదు. వీఆర్వోలు తహసీల్దారు కార్యాలయాలకు పరిమితం అవుతున్నారు. ఇంజనీరింగ్ కార్యదర్శులు మండల ఏఈలకు అటాచ్ అవుతున్నారు. హెల్త్ సెక్రటరీని పీహెచ్‌సీకి పిలిపించుకొంటున్నారు. పట్టణ సచివాలయాల్లో ప్రణాళిక కార్యదర్శిని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు వెంట తిప్పుకొంటున్నారు. సచివాలయాలకు వెళ్లినా ఈ కార్యదర్శుల సేవలు అందే పరిస్థితి కనిపించడం లేదు. ఇక పంచాయతీ కార్యదర్శి, అడ్మిన్ సెక్రటరీలను పన్ను వసూళ్ళకు వెళ్లమంటున్నారు. ఆంధ్రజ్యోతి సచివాలయాలను విజిట్ చేయగా పలు సచివాలయాల్లో ఈ పరిస్థితి కనిపించింది.



ఈయన పేరు దారా రామయ్య. యూరియా కార్డు కోసం సంగం-2 సచివాలయానికి వెళ్లాడు. సిబ్బంది లేకపోవడంతో అక్కడే పడిగాపులు కాశాడు. విసిగి వేశారిపోయి ఇంటిముఖం పట్టాడు.



వరికుంటపాడు : పెద్దిరెడ్డిపల్లి సచివాలయంలో..



ఆత్మకూరు : 5వ వార్డు సచివాలయంలో పనిలో నిమగ్నమై ఉన్న సిబ్బంది



మనుబోలు : పిడూరు సచివాలయంలో ఖాళీగా ఉన్న డీఏ కుర్చీ

'సోమశిల' నుంచి ఆగిన నీటి విడుదల

అనంతసాగరం నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నుంచి క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదల చేస్తున్న నీటిని అధికారులు ఆపేశారు. ఎగువ ప్రాంతం నుంచి బుధవారం 9,012 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి వచ్చి చేరుతోంది. ఇక దిగువ ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. జలాశయంలో 71.791 టీఎంసీల నీరు నిల్వ ఉంది. క్రస్ట్‌గేట్లు దించేయడంతో జలాశయం ముందు వాహన రాకపోకలు కొనసాగుతున్నాయి.

- **రాపూరు :** కండలేరు డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 58.32 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 600 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 820 క్యూసెక్కులు ఉన్నట్లు పేర్కొన్నారు.

బీపీఎస్ వచ్చేసిందోచ్!

ఆరేళ్ల ఎదురుచూపులకు తెర

120 రోజుల్లోపు దరఖాస్తు నమోదుకు అవకాశం



నెల్లూరు(సిటీ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : గడిచిన ఆరేళ్లుగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజ్డ్ స్కీం) వచ్చేసింది. ఇంటి ప్లాన్ లేకుండా, ప్లాన్‌తో నిర్మించి అనధికార నిర్మాణాలున్న కట్టడాలన్నీ బీపీఎస్ పరిధిలోకి వస్తాయని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో బీపీఎస్‌ను విడుదల చేసిన సర్కారు ఆ తరువాత ఈ ఊసే లేకపోవడంతో ఆరేళ్లుగా నిర్మాణదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదం పొందిన ఈ ప్రక్రియకు తుది మెరుగులు దుద్దిన సర్కారు ఎట్టకేలకు జీవో రూపంలో విడుదల చేయడం పట్ల నిర్మాణదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 31లోపు నిర్మాణం పూర్తయిన కట్టడాలకు ఈ పథకం వర్తిస్తుందని ఉత్తర్వుల్లో సర్కారు తెలిపింది. ఈ పథకం అమల్లోకి వచ్చిన బుధవారం నుంచి 120 రోజుల్లోపు బీపీఎస్ ద్వారా ప్రయోజనం పొందాలనుకునే వారు రూ.10 వేలు చెల్లించి పోర్టల్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలి. 2019 తరువాత ఆగస్టు 31 వరకు నెల్లూరులో శరవేగంగా నిర్మాణాలు జరిగాయి. ఇందులో 10 శాతం అతిక్రమణలోపు ఉన్నవారు కార్పొరేషన్‌లో అనుమతులు పొందగా అంతకు మించి అతిక్రమణ, అనుమతులు లేని భవనదారులు బీపీఎస్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం బీపీఎస్ విడుదల చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో భవన నిర్మాణదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి సుమారుగా రూ.50-70 కోట్లు వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



'మాయా పెట్టె'తో పాఠాలు

- పాఠశాలలకు చేరిన 658 నైపుణ్య కిట్లు
- ఒక్కో కిట్‌లో 62 ఆట వస్తువులు
- పిల్లల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వ నిర్ణయం

8

30 ఏళ్ల బాధ తప్పింది



ముప్పై ఏళ్లుగా అద్దె ఇంటిలో ఉంటున్నాము. అద్దె చెల్లించలేక ఇబ్బందులు పడ్డాము. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం వల్ల మా సొంతింటి కల నెరవేరింది. 30 ఏళ్ల బాధ తప్పింది. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది.

- పుల్లా పుష్పరాణి, పడుగుపాడు

ఎంతో ఆనందంగా ఉంది



సొంతంటి కల ఈ రోజు నెరవేరింది. సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో చేసిన వాగ్ధానాన్ని నెరవేర్చారు. ఎంతో ఆనందంగా ఉంది. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, కలెక్టరు హిమాన్షు శుక్లా సమక్షంలో సొంతింటిలోకి గృహ ప్రవేశం చేయడం మరింత ఆనందాన్నిచ్చింది.

- పోలిశెట్టి వెంకటమ్మ, పడుగుపాడు

గూడు కల.. నెరవేరిన వేళ!



కోవూరు : పడుగుపాడులో లబ్ధిదారుడి ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, పక్కన కలెక్టరు హిమాన్షు శుక్లా

కోలాహలంగా పేదల గృహ ప్రవేశాలు ● పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నెల్లూరు (జడ్పీ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కల నెరవేరింది. గత ప్రభుత్వంలో ప్రకటనలకే పరిమితమైన గృహప్రవేశాలు, ప్రస్తుత ప్రభుత్వంలో వేగంగా జరుగుతున్నాయి. రూ.వేల కోట్లు ఖర్చుచేసి పేదలకు స్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణాలు గతంలో చేపట్టినా అవి పూర్తికాక అసంపూర్తిగానే మిగిలిపోయాయి. దీంతో లబ్ధిదారుల్లో తీవ్ర నిరాశ నిస్పృహ నెలకొంది. అయితే, గతేడాది జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగా, పక్కా ఇళ్ల నిర్మాణాలను విడతల వారీగా పూర్తి చేస్తూ లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయిస్తోంది. బుధవారం కోవూరు, ఉదయగిరి, కందుకూరు, కావలి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో గృహ ప్రవేశాలు జరిగాయి. నెల్లూరుసిటీ, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో మాత్రం త్వరలో గృహప్రవేశాలను చేయించనున్నారు.

- **మౌలిక వసతులు కల్పిస్తాం**

కోవూరు, (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం పడుగుపాడులో 38 మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు చేశారు. కలెక్టరు హిమాన్షు శుక్లాతో కలిసి ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వంలోలే అవుట్లలో మౌలిక వసతులు కల్పించలేదని, పేదలకు పక్కాగృహాలు కేటాయించకుండా నిర్లక్ష్యం వహించారని వివరించారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెడుతున్నట్లు చెప్పారు.

- **19,678 గృహ ప్రవేశాలు**

జిల్లావ్యాప్తంగా 19,678 ఇళ్లలో లబ్ధిదారులతో ప్రవేశాలు చేస్తున్నట్లు కలెక్టరు హిమాన్షు శుక్లా అన్నారు. పీఎంఏవై పథకం కింద అర్హులందరికీ పక్కాగృహాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు ఈ పథకం కింద 2,838 నూతన గృహాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామన్నారు. సొంత ఇల్లులేని పేదలందరూ సచివాలయాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్, ఆర్డీఓ అనూష, తహసీల్దారు సుబ్బయ్య, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు కమలాకరరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, వేంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇలాగైతే ప్రమాదాలు జరగవా!?

నెల్లూరు : ఈ ఆటోలో ప్రయాణించాల్సింది నలుగురు లేదా ఐదుగురు. కానీ ఇందులో చూడండి. ఎంతమంది ఉన్నారో ఆ డ్రైవర్‌కే తెలియాలి. అనుకోని ప్రమాదం జరిగితే వీరందరి పరిస్థితి ఏమిటో?

రహదారులు.. రక్తపుటేరులు!

- భయం భయంగా హైవేలపై ప్రయాణం
- జిల్లా రహదారి భద్రతా మండలి ఏం చేస్తున్నట్టు!?
- ప్రభుత్వ శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- శోకసంద్రంలో మునిగిపోతున్న కుటుంబాలెన్నో!

రెప్పపాటులో ఘోరం జరిగిపోతోంది. రక్తం మరిగిన రహదారులపై కాస్త ఏమరుపాటుతనం ఎంతోమంది జీవితాల్లో తీవ్ర విషాదం నింపుతోంది. మొన్న సంగం.. నిన్న నెల్లూరు... రేపు ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని జిల్లావాసులు భయకంపితులవుతున్నారు. ప్రమాదం.. మృతులు... క్షతగాత్రులు.. ఇవన్నీ అటుంచితే జిల్లా అధికార యంత్రాంగంపై తీవ్ర విమర్శలు పుట్టుకొస్తున్నాయి. బ్లాక్‌స్పాట్‌లను గుర్తిస్తున్నా ఆ ప్రాంతంలో ప్రమాదాలు నిలువరించలేకపోతున్నారు. జిల్లా రహదారి భద్రతా మండలి సమావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలు అమలుకావడం లేదు. మరోవైపు వాహనదారుల నిర్లక్ష్యమూ ప్రమాదాలకు కారణాలు అవుతున్నాయి. ఏదిఏమైనా ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోయి ఎంతోమందిని మృత్యువు కబళించింది.

- వివరాలు 8లో..



నెల్లూరు: చెన్నై-కోల్‌కతా జాతీయరహదారి పక్కనే ఆపి ఉన్న లారీలు

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు

కాంతారావు నేడు రాక

- పలు పథకాలపై సమీక్ష

నెల్లూరు (హరనాథపురం) : రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బీ కాంతారావు ఈనెల 13, 14 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తారని, పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. పీడీఎస్ షాప్స్, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలిస్తారని పేర్కొన్నారు. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలు తనిఖీ చేస్తారని తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) పథకంపై సమీక్ష, తదితర కార్యక్రమాల్లో కాంతారావు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.



వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

- జిల్లావ్యాప్తంగా వైసీపీ శ్రేణుల ఆందోళనలు

6

న్యూమోనియాపై అవగాహన

ఇందుకూరుపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జగదేవిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ న్యూమోనియా దినోత్సవం సందర్భంగా యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం జంగంవారిదొరువులో న్యూమోనియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుధాకర్‌రావు ఈ వ్యాధి పిల్లలకు ఎలా సంభవిస్తుందో వివరించారు. దీనికి నివారణ చర్యలను సూచించారు. కార్యక్రమంలో హెచ్ ఈవో శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, సీహెచ్‌వో నీలిమ, హెల్త్ అసిస్టెంట్ మాధవ, ఏఎన్‌ఎంలు మణెమ్మ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11,840
వెండి కిలో ధర	రూ. 1,61,100
వెండి ఒక గ్రాము	రూ. 167.10

టీడీపీకి కార్యకర్తే అధినేత

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, అబ్దుల్ అజీజ్

కోవూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తే అధినేతగా భావిస్తామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్థానిక ఓ కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన టీడీపీ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంకితభావంతో పనిచేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీకి గొప్పబలమన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవమే లక్ష్యంగా ఎన్టీఆర్ టీడీపీని ఏర్పాటు చేశారన్నారు. ఎన్టీఆర్ ఆశీర్వచనం, చంద్రబాబునాయుడు, లోకేశ్‌ల నాయకత్వ లక్షణాలు తమను నడిపిస్తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఓటరుకు మధ్య వారధులు టీడీపీ కార్యకర్తలేనన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని కోరారు. ఇకపై వారానికొక రోజు కార్యకర్తలందరితో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటానన్నారు. పార్టీ పదవులు పొందిన నాయకులందరితో ప్రమాణం చేయించారు. అంతకు ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1983 నుంచి టీడీపీలో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలను సన్మానించారు. భారీ కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్, నియోజకవర్గ పరిశీలకులు పుల్లారెడ్డి, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, జొన్నవాడ ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు తిరుమూరు అశోక్‌కుమార్ రెడ్డి, బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కోవూరు ఎంపీపీ పార్వతి, సర్పంచు విజయ, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, ఐదు మండలాల పార్టీ మండల కమిటీ అధ్యక్షులు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేని కలిసిన ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్

ఇందుకూరుపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రావెళ్ల వీరేంద్ర నాయుడుకి రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్‌గా పదవి రావడంతో తన అనుచరులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని నెల్లూరులోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి గజమాలతో సత్కరించి ఆమెకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ కష్టకాలంలో పార్టీ జెండా మోసిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకి పార్టీ అధిష్ఠానం తప్పకుండా న్యాయం చేస్తుందని తెలిపారు. అందుకు నిదర్శనం వీరేంద్ర నాయుడుకి ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్‌గా పదవి ఇవ్వడమేనని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలే లక్ష్యంగా వీరేంద్రనాయుడు పనిచేయాలని ఆమె సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో జెండా మోసిన, ఓర్పు కలిగిన నాయకులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మునగాల రంగారావు, గంపల అనిల్‌కుమార్, లెనిన్, గుండాల కృష్ణారెడ్డి, బొల్లినేని హరినాయుడు, బొల్లనేని రవినాయుడు, దొడ్ల మల్లికార్జున, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

‘మలిదేవి’ ఆధునికీకరణ కలేనా!?

● రూ.87.17 కోట్ల మంజూరు ● ముళ్ల పొదలు, గుర్రపుడెక్క తొలగింపుతో సరి ● శిథిలావస్థలో బ్రిడ్జిలు, కల్వర్టులు





బుచ్చి పెద్దూరు వద్ద గుర్రపుడెక్కతో పూడిపోయిన మలిదేవి కాలువ, శిథిలావస్థలో కూలేందుకు సిద్ధంగా బ్రిడ్జి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గంలో విస్తరించి ఉన్న మలిదేవి డ్రెయిన్ ఆధునికీకరణ కలగా మిగిలింది. వర్షం, వరదలతోపాటు కనిగిరి రిజర్వాయర్ నుంచి విడుదలయ్యే లీకేజీ, ముంపు జలాలు, బుచ్చి మండలంలోని చుట్టుపక్కల గ్రామాలు, వ్యవసాయ పొలాలు, చెరువుల్లో నుంచి వచ్చే ఊట జలాలు సముద్రంలో కలిసేలా 100 అడుగులకు పైగా వెడల్పుతో కనిగిరి రిజర్వాయర్‌కు అనుసంధానంగా మలిదేవి డ్రెయిన్‌ను నిర్మించారు. ఈ కాలువకు ఇరువైపులా పటిష్టమైన కరకట్టలు, గ్రామాలు, పొలాల పరిధిలో కాలువపైన రైతులు, ప్రజలు, వాహనాల రాకపోకల కోసం బ్రిడ్జి లు, కల్వర్టులు, తూములు ఏర్పాటు చేశారు. కాలక్ర మంలో మలిదేవి ఆక్రమణలతో 20 నుంచి 30 అడుగులకు కుంచించుకుపోయింది. దీంతో 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అప్పటి కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నీటి పారుదల శాఖ పెన్నార్‌డెల్టా డ్రైనేజీ సిస్టమ్ కింద మలిదేవి ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు రూ. 87.41 కోట్లు అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేయించారు. ఈ నిధులు మంజూరైతే బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరి రిజర్వాయర్ దగ్గర జీరో పాయింట్ నుంచి విడవలూరు మండలం ఊటుకూరు వద్ద సముద్రంలో కలిసే వరకు మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లు ఆధునికీకరణ చేసేలా ప్రణాళిక రూపొందించి ఈ మేరకు శంకుస్థాపన కూడా చేశారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ రెడ్డిచ్చే.. మొదలెట్టే.. సామెతగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో 2021లో నీటిపారుదలశాఖ ఎన్‌ఎస్‌పీ (నార్మల్ స్టేట్ ప్లాన్) నిధులు రూ.87.17కోట్ల అంచనాతో మలిదేవి కాలువ ఆధునికీకరణకు టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించి చేతులు దులుపుకున్నారు. రెండేళ తరువాత బుచ్చిలో 2023లో కనిగిరి రిజర్వాయర్ వద్ద జీరో పాయింట్ వద్ద నుంచి పెద్దూరు వద్ద మలిదేవిపైన బ్రిడ్జి సమీపం వరకు కాలువ కర కట్టలపైన ముళ్ల పొదలు, కాలువలో గుర్రపుడెక్క, తూటాకును తూతూమంత్రంగా తొలగించి ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయనిపించారు. దీంతో కాలువలో ఎప్పటిలాగే గుర్రపుడెక్క, తుంగ, తూటాయి కరకట్టలను మించి దర్శనమిస్తోంది. కాలువ పూడికతీత, ఆధునికీకరణ పూర్తయిపోగా, ఇక మిగిలింది కల్వర్టులేనని తేల్చిన అధికారులు రూ.30 కోట్లుకు బిల్లులు పెట్టినట్టు తెలిసింది.

● శిథిలావస్థలో వంతెనలు

బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరు వద్ద, ఇస్కపాళెం పంచాయతీ పల్లాప్రోలుకు వెళ్లే మార్గంలో ఉన్న మరో బ్రిడ్జీలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. పల్లాప్రోలు మార్గంలో ఉన్న సుమారు 40 ఏళ్ల క్రితం పాత దిమ్మెలపైనే గోడకట్టి మళ్లీ శ్లాబు నిర్మించడంతో ఆ బ్రిడ్జి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా బుచ్చి, పల్లాప్రోలు వద్ద మలిదేవిపైన బ్రిడ్జీలు కూలితే బుచ్చి నుంచి దగదర్తి వరకు రాకపోకలకు తీరని అంతరాయం కలుగుతోంది. ప్రతి ఆరు నెలలకు కాలువలో గుర్రపుడెక్క, తూటాకు, తుంగ తొలగింపునకు చర్యలు చేపట్టాల్సి ఉన్నా రెండేళ్లైనా ఆ దిశగా చర్యలు లేక మలిదేవి కాలువ పూడిపోయి నీరు పారే మార్గంలేకుండా దర్శనమిస్తోంది. ఇప్పటికే వరినాట్లుకు రైతాంగం సిద్ధమవుతున్న తరుణంలో మళ్లీ వర్షాలు, వరదలు సంభవిస్తే మలిదేవి కాలువ పూడికతో రైతాంగం నష్టపోవాల్సి వస్తోంది.

పనులు పూర్తయ్యాయి

మలిదేవి కాలువ పూడికతీత పనులు పూర్తయ్యాయి. బుచ్చి నుంచి ఊటుకూరు వరకు 7 శ్లాబ్ బ్రిడ్జిలు, రక్షణ గోడలు, 125 కల్వర్టుల పనులు మాత్రమే చేపట్టాల్సి ఉంది. బుచ్చి పెద్దూరు వద్ద మలిదేవి కాలువపైన శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం మరో నెలలోపు ప్రారంభించనున్నారు.

- తారక రామారావు, డీఈఈ, మలిదేవి కాలువ

కాలువ పూర్తిగా కుంచించుకుపోయింది

మలిదేవి కాలువ చాలా వరకు కుంచించుకుపో యింది. ఎక్కడ చూసినా పూడిక దర్శనమిస్తోంది. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సీఎంగా 1991లో మలిదేవి డ్రైన్ ఆధునికీకరణకు రూ.18కోట్లు మంజూరు చేశారు. దీంతో కనిగిరి రిజర్వాయర్ దగ్గర 0 పాయింట్ నుంచి ఊటుకూరు వరకు 40 కిలోమీటర్లు పొడవునా కాలువ కరకట్టలకు విస్తరణ చేపట్టారు. ఆ తరువాత ఇప్పటి వరకు కాలువ ఆధునీకరించలేదు. కరకట్టలు పటిష్టం చేయకపోతే భవిష్యత్తులో వరదలు సంభవిస్తే రైతులతోపాటు కాలువకు ఇరువైపులా ఉన్న ప్రాంతాలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసివస్తుంది.

- కావలి వెంకటలక్ష్మి, వవ్వేరు నీటి సంఘం డైరెక్టర్

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు : కాకాణి



ర్యాలీలో మాట్లాడుతున్న మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం తగదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం చేపట్టిన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. బజారుకూడలి నుంచి బయలుదేరిన ప్రదర్శన తహసీల్దారు కార్యాలయం వరకు సాగింది. ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని అడ్డుకుంటామన్నారు. ఆంక్షలను ఎదిరించి ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం తగదన్నారు. పేదలకు వైద్య విద్య అందకుండా చేయడాన్ని అడ్డుకుంటామన్నారు. ఆందోళనలో వైసీపీ నాయకులు వీరి చలపతిరావు, రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, శివుని నరసిహులురెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి, కవరగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనవసరంగా యూరియా వాడకండి



రైతులకు యూరియా అందిస్తున్న వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య

మనుబోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వరిసాగులో అనవసరంగా యూరియా వాడరాదని, అవసరమైన మోతాదు మేరకే వాడితే ఆరోగ్యకరమైన పంట దిగుబడి వస్తుందని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. మండలంలోని కొలనుకుదురు, బద్దెవోలు గ్రామాల్లో బుధవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ అన్నదాతలకు యూరియా గురించి ఆందోళన చెందవద్దన్నారు. అందరికీ తగినట్లుగా సమయానికి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు సౌందర్యసుధ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా అశోక్‌రెడ్డి



రాపూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల టీడీపీ అధ్యక్షుడిగా చెన్ను అశోక్‌రెడ్డి ని అధిష్ఠానం ప్రకటించింది. 10 మంది సభ్యులతో ఉన్న మండల కమిటీ బుధవారం వెంకటగిరిలోని ఎస్‌ఆర్‌ఎల్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే కురుగొండ్ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. మండల ఉపాధ్యక్షుడిగా గండపనేని మధునాయుడు, ప్రధాన కార్యదర్శిగా మూరంరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా తాటి శ్రీనివాసులు, పఠాన్ చాన్‌బాషా, షేక్ అర్షద్, కార్యదర్శులుగా పిల్లకదుపు నరేంద్ర, చిలుమూరి రమణమ్మ, కూనిపోగు కన్నయ్య, ట్రెజరర్‌గా కొండ్లపూడి శివారెడ్డి నియమితులయ్యారు.

16న ఆలయ వార్షికోత్సవం

ఉదయగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మిట్టపల్లిలో శ్రీసీతారాముల ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను 16న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా స్వామివారికి గణపతి పూజ, పుణ్యహవచనం, కలశ స్థాపన, అభిషేకాలు, విశేష అలంకరణ తదితర పూజలు జరుగుతాయని పేర్కొంది.

గిరిజనుల అభ్యున్నతికి కృషి : సోమిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభ్యున్నతికి తాను కృషి చేస్తానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మల్లికార్జునపురం ఎస్టీకాలనీలో బుధవారం సోమిరెడ్డి పలు కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షెల్ (ఎస్ఈఐఎల్) విద్యుత్ పరిశ్రమ కంపెనీ ఆధ్వర్యంలో మల్లికార్జునపురం గిరిజనకాలనీలో అవసరమైన మౌలిక వసతులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఆ కంపెనీ ద్వారా ఇప్పటి వరకు 14వాటర్ ప్లాంట్లు, 180 సోలార్ లైట్లు, ఆరోగ్య కేంద్రం, పంచాయతీ భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక వసతిగృహాల్లో 8,9 తరగతులు చదివే బాలికలకు సైకిళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఐటీడీఏ ద్వారా ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, 3వేల మంది గిరిజనులకు ఆధార్ కార్డులు మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. తోటపల్లిగూడూరు నుంచి సాల్‌పేట వరకు త్వరలో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 2 ట్యాంకులు ప్రారంభించారు. శివాలయానికి, పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొణతం రఘుబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, జాఫర్‌సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయా డెయిరీ డైరెక్టర్ కోడూరు శ్రీనివాసులురెడ్డి, మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు సుస్మితారెడ్డి, ఇతర నాయకులు ముత్యాల శ్రీనివాసులు, చింత సీతారామయ్య పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు



రహదారిని పరిశీలిస్తున్న టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున తదితరులు

ముత్తుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగాచార్యులకండ్రిగ గ్రామానికి వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టనున్నామని మండలం టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జునయాదవ్ తెలిపారు. బుధవారం ఆ రహదారిని ఆయన టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి గ్రామాల అంతర్గత రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఈ నేపథ్యంలో రంగాచార్యుల కండ్రిగ గ్రామంతోపాటు అరుంధతివాడకు వెళ్లే మార్గానికి మరమ్మతులు చేయనున్నామన్నారు. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ అధికారులను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సతీష్‌నాయుడు, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి హాట్‌బాక్సుల వితరణ



ఆలయానికి హాట్ బాక్సులు అందచేస్తున్న దాత మహేష్

రాపూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మద్దెలమడుగు సమీపాన ఉన్న మహావిష్ణువు, అయ్యప్ప స్వామి ఆలయానికి అంకమ్మ తల్లి మొబైల్ దుకాణ యజమాని కొత్తాపు మహేష్ ఆరు హాట్‌బాక్స్‌లు వితరణ చేసారు. తన తండ్రి కీర్తిశేషులు మోహనయ్య జ్ఞాపకార్థం సుమారు రూ. 20 వేల విలువ చేసే ఆరు హాట్ బాక్స్‌లను ఆలయ కమిటీకి అందచేశారు. కార్తీక మాసంలో మాల ధరించిన స్వాముల సౌకర్యార్థం వీటిని అందించినట్లు ఆయన తెలిపారు.

నేడు మహాలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్ఠ

తోటపల్లిగూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావూరు వారికండ్రిగ గిరిజన కాలనీలో గురువారం మహాలక్ష్మీ అమ్మవారి ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు టీడీపీ సీనియర్ నేత కోడూరు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన డిగ్రీ పరీక్షలు

వెంకటాచలం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో అనుబంధ కళాశాలల డిగ్రీ పరీక్షలు గతనెల నుంచి నిర్వహిస్తున్నారు. బుధవారంతో పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్. మధుమతి తెలిపారు. అన్నీ పరీక్షలకు కలిసి 931మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 801మంది మాత్రమే పరీక్షలు రాశారని, 130మంది గైర్హాజరయ్యారని ఆమె తెలిపారు.

కోవెరపాలెంలో యూరియా పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేసిన సొసైటీ చైర్మన్ నారాయణ

తోటపల్లిగూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవెరపాలెంలో బుధవారం టీడీపీ సీనియర్ నాయకులు ముత్యాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో పేడూరు సొసైటీ చైర్మన్ నారాయణ చేతుల మీదుగా రైతులకు యూరియా పంపిణీ చేశారు. అనంతరం సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా ప్రతి రైతుకు అందిస్తామని తెలిపారు. సొసైటీ కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, జనసేన నాయకులు, ముత్యాల అమర్‌నాథ్‌బాబు పాల్గొన్నారు.

అన్నా.. అంటే పలికే వ్యక్తి ‘మాతూరు’

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



మాతూరు శ్రీనివాసులురెడ్డి సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

విడవలూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న వారు అన్నా.. అంటే పలికే వ్యక్తి టీడీపీ నాయకుడు దివంగత మాతూరు శ్రీనివాసులురెడ్డి అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొనియాడారు. విడవలూరులో బుధవారం జరిగిన రైతు సంఘం నాయకుడు, టీడీపీ నేత మాతూరు శ్రీనివాసులురెడ్డి పెద్దకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మాతూరు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆనంతరం జరిగిన సంస్మరణ సభలో పాల్గొని మాట్లాడారు. 2024లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు ఆయన ఎంతగానో శ్రమించారన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు వచ్చినా వాటి పరిష్కారానికి సలహాలు, సూచనలు ఇచ్చేవారన్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీరని నష్టమన్నారు. అయన ఆత్మకి శాంతి చేకూరాలని కోరుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఎంసీఎల్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

వృద్ధురాలిపై దాడి, దోపిడీ

● కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో దారుణం
● 12 సవర్ల బంగారు ఆభరణాల చోరీ

నెల్లూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ వృద్ధురాలిపై కొందరు దుండగులు దాడి చేసి ఆమె మెడలోని బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. సేకరించిన సమాచారం మేరకు... హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎంఐజీ ఇళ్లలో కేసరి రుక్మిణమ్మ (73) ఒంటరిగా జీవిస్తున్నారు. ఆమె తమ్ముడు శ్రీనివాసులు అదే ప్రాంతంలో మరో చోట ఉంటున్నారు. మంగళవారం రాత్రి 9.30 గంటల వరకు అక్కతో ఉన్న ఆయన ఆ తర్వాత తన ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం రుక్మిణమ్మ ఇంటి గేటు వేస్తుండగా ముగ్గురు దుండగులు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి కొట్టారు. ఆమె ఒంటిపై ఉన్న 12 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. గాయపడిన వృద్ధురాలిని గుర్తించిన చుట్టుపక్కల వారు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై తమకు సమాచారం అందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ గుంజి వేణు బుధవారం తెలిపారు. ఈ దోపిడీ ఘటన చుట్టుపక్కల ప్రాంతాల్లో అలజడి రేపింది.

బత్తులపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

పొదలకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బత్తులపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఆనంద్‌రెడ్డి, అశోక్ రెడ్డిలు, వారికి సంబంధించిన సిమెంటు, ఇనుప కమ్ములను గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల భవనంలో నిల్వ ఉంచారు. అయితే ఇటీవల సచివాలయానికి యూరియా రావడంతో ఆ యూరియా భద్రపరచడానికి అదే స్కూల్ భవనాన్ని వ్యవసాయ శాఖ అధికారులు ఎంపిక చేశారు. దీంతో అక్కడ ఉన్న సిమెంటు, ఇనుప కమ్ములను ఖాళీ చేయమని కోరగా వారు ఖాళీ చేసే సమయంలో ఈ బడికి గేటు కూడా తామే పెట్టించామని, వీటితో పాటు బడికికూడా తీసుకెళ్లామని చెప్పారు. దీంతో అక్కడ ఘర్షణ నెలకొంది. ఇనుప గేట్‌ను ఊడగొడితే అడ్డొచ్చిన వారిని గడ్డపారతో పొడుస్తామని బెదిరించారు. దీంతో గ్రామ టీడీపీ నాయకుడు శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హనీఫ్ తెలిపారు.

జూద స్థావరంపై దాడి

ఉదయగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆనకట్ట సమీపంలో గల పాత బాణసంచా గోదాము వద్ద నిర్వహిస్తున్న జూదస్థావరంపై మంగళవారం రాత్రి ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, రూ.5 వేలు నగదును స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లికి రావినూతల నవ్య అదృశ్యమైనట్లు తండ్రి వెంకటేశ్వర్లు బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు, నవ్య స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతుంది. మంగళవారం కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వస్తుంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ముఖం కడిగించి, పంపండి : ఎస్పీ అజిత

● ‘ఫేస్‌వాష్ అండ్ గో’ పరిశీలన



ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరుగకుండా సురక్షిత ప్రయాణం కోసం ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు అర్ధరాత్రి దాటిన తర్వాత వాహనాలు నడిపే డ్రైవర్లను ఆపి నీళ్లతో ముఖం కడిగించి పంపించాలని (ఫేస్‌వాష్ అండ్ గో) ఎస్పీ డాక్టర్ అజిత సూచించారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి పూట జరుగుతున్న ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద ఆమె పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాత్రిపూట జాతీయ రహదారులపై తిరిగే ట్రావెల్స్ బస్సులు, లారీలు, వ్యాన్లు, ఇతర వాహనాల డ్రైవర్లను అప్రమత్తం చేస్తూ ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

● జిల్లావ్యాప్తంగా వైసీపీ శ్రేణుల ఆందోళనలు

నెల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలలను ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారం జిల్లావ్యాప్తంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు. నియోజకవర్గాల ఇన్‌చార్జులు ఈ ఆందోళనను ప్రతిష్ఠాత్మకంగా భావించి జనాన్ని సమీకరించారు. ఆయా కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టి, అధికారులకు వినతిపత్రం అందజేశారు. పేద విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేందుకు, పేదలకు మెరుగైన వైద్యం ఉచితంగా అందించాలన్న దృక్పథంతో రాష్ట్రంలో 15 వైద్య కళాశాలలను స్థాపించారని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం ఆ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. జీవోను రద్దు చేసి మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కావలిలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి వైసీపీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఆర్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కందుకూరులో వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉదయగిరిలో జరిగిన ఆందోళనకు మేకపాటి అభినవ్‌రెడ్డి సారథ్యం వహించారు. నెల్లూరు సిటీలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి నుంచి వెంకటాచలం తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, కార్యకర్తలు పాల్గొన్నారు. నెల్లూరు రూరల్‌లో వైసీపీ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బారాషహీద్ దర్గా నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కోవూరులో మాజీ ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వింజమూరులో ట్రాఫిక్ కష్టాలు

వింజమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణం అభివృద్ధి చెందుతూ పలు విద్యా సంస్థలు విస్తరిస్తున్న తరుణంలో ప్రజలను ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా పాతబస్టాండ్, కొత్త బస్టాండ్ బంగ్లా సెంటర్ కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు జటిలం అయ్యాయి.విద్యా సంస్థలు పట్టణంలో పెరిగి, విద్యార్థులు స్కూలు వదిలినప్పుడు ఆయా కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. అలాగే రోడ్డు పక్కన వాహనాలను వదిలివేయడం, రోడ్డును ఆక్రమించేసి రేకుల షెడ్లను వేయడంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని ప్రజలంటున్నారు. సాయంత్రం 6గంటల నుంచి జనసంచారం ఎక్కువగా ఉండడం, రోడ్డు కుంచించుకుపోవడం వలన ప్రజలు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందిపడుతున్నారన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 600



పేదల గృహ ప్రవేశాలు

నెల్లూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : ప్రతీ పేదోడి సొంతింటి కలను కూటమి పార్టీల ప్రభుత్వం నిజం చేసిందని అధికారులు, నేతలు అభిప్రాయపడ్డారు. నెల్లూరు రూరల్లోని 37వ డివిజన్ రాంనగర్ నందు ప్రభుత్వ సహకారంతో కొత్త కోటేశ్వరి నిర్మించుకున్న ఇంటికి ఎస్‌ఎంసీ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ జెంబో తాళాన్ని అందచేశారు. ప్రభుత్వం తరుపున పసుపు, కుంకుమ, చీర ఇచ్చారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇల్లు, ఇంటి స్థలం అందుతుందని స్పష్టం చేశారు.

ఇరిగేషన్ స్థలానికి ఎసరు

- హరనాథపురంలో రూ.కోటి విలువ చేసే భూమి ఆక్రమణ
- ప్రితార్జితంగా చూపి పక్కా సర్వే నంబర్‌తో రిజిస్ట్రేషన్
- చెక్ చేసుకోకుండానే రిజిస్టర్ చేసిన అధికారులు
- ఆ భూమిలో అక్రమ కట్టడం.. కూల్చేసిన మున్సిపల్ సిబ్బంది
- చర్యల్లేకుండా తెరవెనుక మంత్రాంగం

నెల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఒకరేమో ప్రభుత్వ ఆస్తిని కొట్టేయాలని స్కెచ్ వేయగా.. దానిని కాపాడాల్సిన మరొకరేమో ఆ కుట్రకు మార్గం సుగుమం చేశారు.. వెరసి రూ.కోటి విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి అప్పనంగా అప్పగించారు. నెల్లూరు నగర నడిబొడ్డులోని హరనాథపురంలో కృష్ణపట్నం రహదారికి ఆనుకొని ఉన్న సుమారు పది అంకణాల కాలువ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రిజిస్ట్రేషన్ జరిగిందే తడవుగా ఆక్రమణదారుడు రాత్రికి రాత్రే ఆ స్థలంలో భవన నిర్మాణం ప్రారంభించాడు. పది రోజుల్లో స్లాబ్ కూడా వేసేశాడు. స్థానిక నాయకుల మొదలు మున్సిపల్ సిబ్బంది వరకూ ఎవరికి ముట్టాల్సింది వారికి ముట్టడంతో ఎవరూ అటువైపు కన్నెత్తి చూడలేదు. అయితే ఓ వ్యక్తి ఈ విషయాన్ని కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం, ఆ తర్వాత సర్వే చేయడంతో అది ఇరిగేషన్ స్థలంగా తేలింది. దీంతో వెంటనే నిర్మాణంలో ఉన్న భవనాన్ని మున్సిపల్ అధికారులు నేలమట్టం చేశారు. తర్వాత ఆ స్థలాన్ని ఇరిగేషన్ శాఖకు అప్పగించడంతో వారు వెళ్లి హెచ్చరిక బోర్డులు పెట్టారు. ఇదంతా జరిగి కూడా పది రోజులు దాటింది. ఇంత బరితెగించి ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందు కు స్కెచ్ వేసిన ఆక్రమార్కులపై గానీ, దీనిని రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపైగానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కనీసం విచారణ కూడా జరపడం లేదు. చర్యల్లేకుండా తెరవెనుక భారీ మంత్రాంగం నడుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఇరిగేషన్ స్థలంలో కట్టిన నిర్మాణాన్ని కూల్చేసిన తర్వాత ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఎవరికి వారు తప్పించుకునే యత్నాలు

హరనాథపురం రెండు, మూడో వీధులకు మధ్యగా ఓ కాలువ ఉండగా, ఇప్పటికే చాలా వరకూ అది ఆక్రమణలకు గురైంది. రోడ్డుకు ఆనుకొని ఉన్న పది అంకణాల స్థలం చాలా కాలంగా ఖాళీగా ఉంది. ఆ పక్కనే ఉన్న ఓ వ్యక్తి కన్ను ఆ స్థలంపై పడింది. కాలువ సర్వే నంబర్‌ను మార్చి ఆ భూమిని మరో సర్వే నంబర్లో చూపిస్తూ రిజిస్ట్రేషన్ చేసు కునేందుకు డాక్యుమెంట్ సిద్ధం చేశారు. ఈ భూమికి ఇంటి నం బర్ కూడా ఉన్నట్లు చూపించి, అది పిత్రార్జితం కింద పేర్కొంటూ రిజిస్ట్రేషన్‌కు వెళ్లారు. అయితే రిజిస్ట్రార్ ఆఫీసులో లోతుగా ఈ డాక్యుమెంట్‌ను పరిశీలించలేదు. ఒక భూమిని రిజిస్ట్రేషన్‌కు తీసుకొస్తే లింకు డాక్యుమెంట్లు చూడడం, ఆ సర్వే నంబర్లో భూ విస్తీర్ణం సరిపోయిందా లేదా అన్నది సరిచూసుకోవడం కనీస బాధ్యత. ఇవేవీ జరిగిన దాఖలాలు లేవు. అసలు ఇరిగేషన్ స్థలానికి మున్సిపల్ సర్వే అధికారులు ఏ విధంగా సర్వే రిపోర్టు ఇచ్చారన్నది కూడా తేలాల్సి ఉంది. సర్వే రిపోర్టు లేకుండానే రిజి స్ట్రేషన్ చేశారా..? అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. అంతేకాదు, ఇప్పటికీ ఆ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను రద్దు చేయ కుండా ఎవరికి వారు తమకు సంబంధం లేదంటూ తప్పించు కుంటుండటం విశేషం.

ఫిర్యాదు చేస్తే చర్యలు

హరనాథపురంలో ఇరిగేషన్ స్థలానికి రిజిస్ట్రేషన్ చేసిన విషయం మా దృష్టికి వచ్చింది. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన డాక్యుమెంట్ నిషేధిత జాబితాలో లేదు కాబట్టి మిగిలిన డాక్యుమెంట్లను సరిచూసి రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఫిర్యాదు అందితే విచారించి డాక్యుమెంట్ రద్దు చేస్తాం.

- బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

నేడు అన్నాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల సందర్భంగా గురువారం ఉదయం 10.30గంటలకు అన్నాభిషేకం జరుగుతుందని ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి బుధవారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి విశేష పూజలు, రాత్రి పాకారోత్సవం జరిగాయి.

దుబాయ్‌లో సుబ్బారెడ్డికి అవార్డు

నెల్లూరు(విద్య), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నేతాజీ పాఠశాల అధినేత ఎంవీ సుబ్బారెడ్డి దుబాయ్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో మంగళవారం జరిగిన ఫ్యూచర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో గ్లోబల్ క్లాస్‌రూమ్ అవార్డును అందుకున్నారు. మూడు దశాబ్దాలకుపైగా విద్యా రంగంలో అందిస్తున్న సేవలకుగాను ఆయనకు ఈ పురస్కారం దక్కింది.

16న యాదవ వన భోజన మహోత్సవం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నెల్లూరు (హరనాధపురం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యాదవ కార్తీక వనభోజన మహోత్సవం ఈనెల 16న మర్రిపాడు మండలంలోని పీఎస్‌ఆర్ బృందావనంలో నిర్వహిస్తున్నామని యాదవ భవన్ ట్రస్ట్ చైర్మన్ బొమ్మి నాగకిషోర్ చెప్పారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వన భోజన మహోత్సవంలో గోపూజ, ఉసిరి చెట్టుకు పూజ, శివ పూజ జరుగుతాయని, జిల్లాలోని యాదవులందరూ కుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరారు. విలేకరుల సమావేశంలో దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, ఆనంగి వెంకటరమణయ్య యాదవ్, పెరుమాళ్ల పద్మజ యాదవ్, చిల్లారి వెంకట రమణయ్య యాదవ్, చెవుల రామచంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ క్రీడాకారిణికి సత్కారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బేస్‌బాల్ ఆసియ కప్ టోర్నమెంట్‌లో భారతదేశం తరపున ఆడి రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించిన జిల్లా క్రీడాకారిణి పల్లికొండ హేమలతను బుధవారం ఘనంగా సత్కరించారు. నగరంలోని చిన్న బజారులో ఉన్న బీజేపీ కార్యాయలంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గం అల్లీపురం గ్రామానికి చెందిన పల్లికొండ హేమలత థాయిలాండ్‌లో జరిగిన అంతర్జాతీయ బేస్ బాల్ ఆసియ కప్ టోర్నమెంట్ లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



క్రీడాకారిణిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- నారాయణ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ

నెల్లూరు(విద్య), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ దత్తాత్రేయశర్మ అన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గొలగమూడి ఆశ్రమంలో బుధవారం నిర్వహించిన కార్తీక వన సమారాధన, మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, హరిత విలువలు పెంచే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. యువత, విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా, సా మాజిక బాధ్యతతో మొక్కలు నాటి, వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఆశ్రమ పరిసరాలు, ఆసుపత్రి, జూనియర్ కళాశాల ప్రాంతాల్లో 300కుపైగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎం చంద్రమోహన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి రూపేష్, సైట్ ఇంజనీర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

ప్రజల కోసం పనిచేద్దాం...!

- ప్రమాణ స్వీకారోత్సవంలో రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : అధికారం ఉన్నా, లేకున్నా మన మందరం ప్రజల్లో ఉండి, ప్రజల కోసం పని చేద్దామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రూరల్లోని 18 గ్రామాలతోపాటు నగరంలోని 1, 2, 12, 17 డివిజన్లకు సంబంధించి తెలుగుదేశం పార్టీ పదవులు పొందిన వారితో ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో నిరంతరం ఉంటూ, పని చేస్తున్న వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరు శాతం విజయాలు సాధించే దిశగా ప్రతీ ఒక్కరు ప్రణాళికబద్ధంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, ప్రదీప్, సారంగం గున్నయ్య, సాబీర్‌ఖాన్, జలదంకి సుధాకర్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్‌పై విస్తృత ప్రచారం చేయండి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి లైసెన్స్‌డ్ ఇంజనీర్లకు సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ నందన్‌తో కలిసి ఆయన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందితే నగరం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.



1, 2, 12, 17 డివిజన్లకు సంబంధించి టీడీపీ పదవులు పొందిన వారితో ప్రమాణం చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

పాఠశాలల్లో ఆధునికీకరణ వేగవంతంగా చేపట్టాలి

- పురపాలక మంత్రి నారాయణ

నెల్లూరు(విద్య), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పాఠశాలల్లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. నగరంలోని ఆర్‌ఎస్‌ఆర్, మల్లెల సంజీవయ్య మున్సిపల్ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. మౌలిక వసతుల కల్పన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువుకునేలా అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దీనికి సంబంధించి చేపడుతున్న పనుల నాణ్యత ప్రమాణాల్లో ఎక్క డా రాజీ పడవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నందన్, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

మాధవరెడ్డికి సన్మానం



నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపాన గల రోటరీ ఆడిటోరియంలో రోటరీ జిల్లా గవర్నర్ నామినీగా ఎన్నికైన కావలి రోటరీ క్లబ్‌కు చెందిన మాధవరెడ్డిని బుధవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ నెల్లూరు సౌత్ సభ్యులు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ నెల్లూరు సౌత్ మాజీ అధ్యక్షుడు సతీష్‌కుమార్, ప్రస్తుత అధ్యక్షురాలు మాలికా బేగం, రోటరీ క్లబ్ నెల్లూరు అధ్యక్షుడు ఉదయభాస్కర్ శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ జిల్లా మాజీ గవర్నర్‌లు భరత్‌కుమార్‌రెడ్డి, ముని గిరీష్, వొమ్మిన సతీష్, అసిస్టెంట్ గవర్నర్ వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై భయం వద్దు అవగాహన అవసరం

- డాక్టర్ గురుసాయి రత్నప్రియ

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్‌పై ఆందోళన, భయం వద్దని అయితే దానిపై అవగాహన అవసరమని ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ గురుసాయి రత్నప్రియ అన్నారు. బుధవారం కొండాయపాలెం అబైడింగ్ హోప్ ట్రస్ట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్య సూచనలు రాగానే డాక్టర్‌ను సంప్రదించాలని చిన్నచిన్న గడ్డలన్నీ క్యాన్సర్ కాదని డాక్టర్ చెప్పేవరకు ఎలాంటి నిర్ధారణకు రావద్దని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో నారాయణ డెంటల్ కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ కన్నన్, జయప్రకాష్, సిస్టర్ రమ, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

- మృతుల కుటుంబాలను ఆదుకోవాలి
- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

నెల్లూరు (వైద్యం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్లకు కారణమైన ఉగ్రవాదులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లీలా మోహన్, నందిపోగు రమణయ్య మీడియాతో మాట్లాడారు. దేశ రాజధానిలోనే ఇలాంటి పేలుళ్లు జరుగుతుంటే మారుమూల ప్రాంతాలలో శాంతి భద్రతల పరిస్థితి ఏమిటని ప్రశ్నిం చారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఈ సంఘటనకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నక్సలైట్లను ఉక్కుపాదంతో అణచి వేస్తామని చెప్పే హోం మంత్రి అమిత్‌షా ఉగ్రవాదాన్ని ఎందుకు అణచలేకపోతున్నారని ప్రశ్నించారు. బాంబు పేలుళ్లలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జిలానీ ఖాన్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి గుది విజయకుమార్, తల్లు శీనయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మనీ స్కాం బాధితులకు న్యాయం చేయాలి

కావలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కావలి ముసునూరు అనంతార్ధ మనీ స్కాం బాధితులకు న్యాయం చేయాలని ప్రజాస్వామిక హక్కు ల పరిరక్షణ వేదిక నేతలు కోరారు. పట్టణంలోని మనీ స్కాం బాధితులను బుధవారం వేదిక సభ్యులు కలిసి విచారించారు. ఈ కేసులో తమకు ఏమీ తెలియదని బాధితులు తెలిపారు. తాము ఇచ్చిన కేసులు నమోదు అయ్యాయో కాలేదో కూడా తమకు తెలియవన్నారు. దీంతో మనీ స్కాం జరిగి సుమారు ఏడాది కావస్తున్నా బాధితులకు ఎటువంటి న్యాయం జరగలేదని వేదిక సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి స్కాంలో ఇరుక్కున్నవారు వడ్డీలు చెల్లించ లేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. బాధితులు ఎవరైనా తమకు జరిగిన అన్యాయాలపై వేదిక సభ్యులను కలిసి వివరాలు చెపితే ప్రభుత్వంపై పోరాడు తామన్నారు. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు కరువది భాస్కర్, పీ.పెంచలయ్య, ఎల్ లక్ష్మీరెడ్డి, దమ్ము దర్గాబాబు, వై.క్రిష్ణ మోహన్, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మనీస్కాం బాధితులతో మాట్లాడుతున్న వేదిక నాయకులు

నేడు రాజకీయ పార్టీల సమావేశం

ఉదయగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మురళి సమీక్ష నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిణి షాజియా బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె తెలిపారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బీ.లక్ష్మీఅక్షర రాష్ట్రస్థాయి తైక్వాం డో పోటీలలో బంగారుపతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు జమ్మూకాశ్మీర్‌లో జరిగే పోటీలలో పాల్గొంటుందని తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్కే. అబ్దుల్‌సలాం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లక్ష్మీఅక్షరను, కోచ్ అఖిల్‌ను డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం, విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జీ.బాలభాస్కర్, బీ.నరేంద్రబాబులు బుధవారం అభినందించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

- వైసీపీ ఆందోళన

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తున్నట్లు ఆరోపిస్తూ వైసీపీ నాయకులు జిల్లా వ్యాప్తంగా బుధవారం అన్నీ నియోజకవర్గాల్లో నిరసన ర్యాలీలు చేపట్టారు. నెల్లూరు నగరంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వీఆర్‌సీ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలంటూ నినాదాలు చేశారు. అనంతరం జేసీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వాలు నడపాల్సిన కళాశాల లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమం లో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జయకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి కోటేశ్వరరెడ్డి, యువజన విభాగ అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున, ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు రూరల్ వైసీపీ నేతల వినతి

నెల్లూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ వైసీపీ బుధవారం చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా నగరంలో ర్యాలీ జరిగింది. బారా షహీద్ దర్గా నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. అక్కడ తహసీల్దారు కృష్ణప్రసాద్‌కు నాయకులు వినతి పత్రం అందచేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆనం విజయకుమార్ రెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

డిసెంబరు 13న జగన్నాథ రథయాత్ర

- బ్రోచర్ ఆవిష్కరించిన ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుఖ్‌దేవ్ స్వామి

కావలి(టౌన్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యావత్ జీవకోటి అనుగ్రహం కోసమే జగన్నాథ రథ యాత్ర అని ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుఖ్‌దేవ్‌స్వామి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రామ్మూర్తిపేటలో ఉన్న ఇస్కాన్ మందిరంలో రథయాత్రకు చెందిన బ్రోచర్లు, కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. అనంతం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 13న కావలి పట్టణంలో జరగనున్న రథ యాత్రలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ప్రజల్లో దైవభక్తి తగ్గిపోతుందని, మన భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతి పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సనానత ధర్మం, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక చింతన అలవర్చేందుకు జగన్నాథ రథయాత్ర దోహదపడుతుందన్నారు. ఎంతో దూరంలోని ఒడిశా రాష్ట్రం పూరీలో వెలసివున్న జగన్నాథుడి రథయాత్రలో పాల్గొనలేని భక్తులు డిసెంబరు 13న కావలిలో జరిగే యాత్రలో పాల్గొంటే పుణ్యఫలం దక్కుతుందన్నారు. దేశం నలుమూలల నుంచి ఇస్కాన్ ప్రముఖులు హాజరౌతారని, స్థానికుల సహకారంతో ఈ యాత్ర జరుతుందన్నారు. సమావేశంలో ఇస్కాన్‌కు చెందిన చంద్రశేఖర్ దాస్, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుఖ్‌దేవ్ స్వామి

విశ్రాంత ఉద్యోగులకు హెల్త్‌కార్డులు, బీమా సౌకర్యం కల్పించాలి

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ఇంజనీరింగ్ శాఖల రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ రామ్‌రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పీ.సుబ్రహ్మణ్యం, కోశాధికారి సీఎం వరకుమార్‌లు బుధవారం కందుకూరులో అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఉద్యోగ విరమణ చేసిన వారు, రానున్న రెండు మూడు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న వారందరినీ అసోసియేషన్‌లో సభ్యులుగా చేర్పించటమే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ స్థానిక ప్రతినిధులు మురళీమోహన్, మాలకొండయ్య, పొనుగోటి మాలకొండయ్య, అగస్టీన్, అంకయ్య, ఇంటూరి మాల్యాద్రి, హసన్‌సాహెబ్, ఆల్ఫ్రెడ్ తదితరులు పాల్గొన్నారు.



నమ్మండి.. ఇది వాగేనండి !

ఇటీవల అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జలాశయాలు, చెరువులు నిండుకుండల్లా మారాయి. వరదనీరు వాగుల ద్వారా లోతట్టు ప్రాంతాలకు ప్రవహిస్తోంది. ఈ క్రమంలో గండిపాళెం జలాశయం కింది భాగంలోని వాగు నామరూపాలు లేకుండా కంపచెట్లు, జమ్ముతో నిండి అడవిని తలపిస్తోంది. ప్రధాన రహదారిలోని ఆర్అంబీ వంతెన వద్ద ఉన్న పిల్లాపేరు వాగు మీదుగా ప్రతినిత్యం ప్రయాణాలు సాగించే అధికారులు, సిబ్బంది అటు వైపు చూడక పోవడం దారుణం.

- ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కలెక్టర్ హిమాన్షు వెల్లడి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 14 నుంచి 20వతేదీ వరకు గ్రం థాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. బుధవారం ఆయన సంబంధిత అధికారు లతో కలిసి వారోత్సవాల పోస్ట ర్లు ఆవిష్కరించారు. వారోత్స వాల్లో భాగంగా బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, కవి సమ్మేళనం, మహిళా దినోత్సవం, వివిధ విజ్ఞానదాయక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



మనిషి పడుకున్నట్లే..!

ఉదయగిరి కొండను చూస్తే.. మనిషి పడుకున్నట్లుగా అనిపిస్తోంది. తిరుపతి కొండను పోలినట్లు ఉండే ఈ కొండను పట్ట ణం నుంచి పరిశీలిస్తే.. ఓ భారీ మనిషి నిద్రిస్తున్నట్లు అగుపిస్తుంది. ఈ చిత్రంలో ఎడమ వైపు పైభాగం నుంచి ముక్కు, పెదవి, నోరు, గడ్డం, గొంతుతోపాటు ఉదర భాగం ఎత్తుగా ఉంటుంది. పట్టణానికి వచ్చే ప్రజలు, పర్యాటకులకు ఈ దుర్గం ఆకృతి ఆకర్షణగా నిలుస్తోందని స్థానికులు పేర్కొన్నారు.

-ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

ఆక్వా రైతులకు లైసెన్స్ తప్పనిసరి

● గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి : నెల్లూరు ఆర్డీవో అనూష

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆక్వా రైతులు విద్యుత్ రాయితీ పొందేందుకు తప్పనిసరిగా ఆక్వా సాగుకు లైసెన్సు తీసుకోవాలని నెల్లూరు ఆర్డీవో అనూష స్పష్టం చేశారు. బుధవారం ఆమె కార్యాలయంలో మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులతో ఆక్వా లైసెన్సులపై కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతులకు అందించే రాయితీలు పొందాలంటే తప్పనిసరిగా లైసెన్సు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఎంతమంది రైతులు లైసెన్సు పొందారన్న వివరాలను తెలుసుకున్నారు. మిగిలిన వారు సమీప గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏవో నిర్మలానందబాబా, అధికారులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో అనూష

ముగిసిన సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడలు

నెల్లూరు(విద్య), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండురోజులుగా జరుగుతున్న సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడాపోటీలు బుధవారంతో ముగిశాయి. జిల్లాలోని అన్నీ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే పురుష, మహిళ ఉద్యోగులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలి రోజు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, లాన్ టెన్నిస్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా బుధవారం స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, యోగ, మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్‌ప్లే పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. డీఎస్‌డీవో పాండురంగారావు, కోచ్‌లు పర్యవేక్షించారు.

న్యుమోనియాపై ప్రజలకు అవగాహన

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : న్యుమోనియా వ్యాధిపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకు వచ్చేలా కృషి చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. బుధవారం ఆమె చాంబర్‌లో న్యుమోనియా వ్యతిరేక పోస్టర్లు విడుదల చేశారు. న్యుమోనియాను అరికట్టటం ద్వారా పిల్లల మరణాలను తగ్గించ వచ్చన్నారు. న్యుమోనియా రక్తంలో ఆక్సిజన్ శాతాన్ని తగ్గిస్తుందని తెలిపారు. చిన్నపిల్లలకు బీసీజీ, పెర్టుసస్ టీకాలతోపాటు న్యుమోనియా వాక్సిన్ ఇవ్వటం వల్ల చిన్నారులలో ఈ వ్యాధిని జయించ వచ్చని తెలిపారు. న్యుమోనియా అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించామని, ఇది వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమా మహేశ్వరి, ఎన్సీడీ అధికారి డాక్టర్ యశ్వంత్, డెమో కనకరత్నం, ఎపిడమాలజిస్ట్ డాక్టర్ భాస్కర్, డీపీవో రమేష్, జ్యోతి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యాధికారులు

16న కార్తీక మాస మహారుద్రాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో ఈనెల 16న ఉదయం 7గంటల నుంచి స్థానిక సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మీ దేవస్థానంలో మహారుద్రాభిషేకం జరుగుతుందని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గుడ్లదొన వాసుదేవరావు, దుద్దుకూరు రమేష్ తెలిపారు. బుధవారం జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహారుద్రాభిషేకం అనంతరం 108 మంది బ్రాహ్మణ దంపతులకు సామూహిక షష్టిపూర్తి, భీమరథ శాంతి, శివకేశవుల కల్యాణం, బ్రాహ్మణ వన సమారాధన జరుగుతాయని, బ్రాహ్మణ సంఘీయులందరూ తరలిరావాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నారాయణరావు, శ్రీధర్‌శర్మ, గడ్డం జయలక్ష్మి తదితయులు పాల్గొన్నారు.

రహదారులు.. రక్తపుటేరులు!

జిల్లాలో రహదారులు రక్తం రుచి మరిగాయి. ప్రమాదాల్లో మృతుల సంఖ్య ఇటీవల పెరుగుతోంది. ఇటీవల సంగం మండలం పెరమన వద్ద ముంబయి హైవేపై జరిగిన ప్రాంతంలో ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. అది మరవక ముందే మంగళవారం నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం ప్రతి ఒక్కరినీ భయభ్రాంతులకు గురి చేసింది. ఇలా నిత్యం జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం మొద్దు నిద్ర వీడకపోవడంతో ఎన్నో కుటుంబాల్లో విషాదఛాయలు అలుముంటున్నాయి.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

ఏటా ప్రమాదాలు ఇలా ...

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	943	398	944
2021	977	466	1006
2022	884	368	974
2023	828	450	905
2024	663	384	645

- భయం భయంగా హైవేలపై ప్రయాణం
- ఇష్టానుసారంగా ఫుడ్‌కోర్టులు, దాబాలు, చిరువ్యాపారాలు
- ఎక్కడికక్కడ వాహనాల పార్కింగ్
- ఆపై మద్యం, నిద్రమత్తు, విశ్రాంతిలేమితో డ్రైవింగ్
- జిల్లా రహదారి భద్రతా మండలి ఏం చేస్తున్నట్టు!?
- బ్లాక్‌స్పాట్‌లను గుర్తించినా ప్రమాదాల నియంత్రణ ఏదీ?
- ప్రభుత్వ శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- శోకసంద్రంలో మునిగిపోతున్న కుటుంబాలెన్నో!



నెల్లూరు : చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి పక్కనే ఆపి ఉన్న లారీలు

జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతి వేగం, నిద్రమత్తు, మద్యం సేవించి వాహనం నడపడంతోపాటు రోడ్డు పక్కన ఇష్టానుసారంగా వాహనాలు ఆపడం. జాతీయ రహదారుల వెంబడి ఫుడ్ కోర్టులు, దాబాలు, బార్లు, మద్యం దుకాణాలు పెరిగాయి. దీనికితోడు రోడ్ల పక్కనే చిన్నపాటి బండ్లు, షెల్టర్‌లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. రహదారులపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతుండటం ద్వారా ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఎప్పటికప్పుడు వీటిని గుర్తించి, నిలువరించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మాత్రం హడావుడి చేయడం, మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లామీదుగా వెళుతున్న జాతీయ రహదారులపై వాహనదారుల కోసం 'రెస్ట్ ఏరియా'లు ఉన్నాయి. ఇక్కడ వాహనాలు ఆపి విశ్రాంతి తీసుకోవడం, వాహనాలను మరమ్మతు చేసుకోవడం వంటివి చేయచ్చు. కానీ ఈ ప్రాంతాల్లో వాహనాలను ఆపడం లేదు.

● అనుభవం లేకుండా..

కరోనా తర్వాత అవసరాల రీత్యా ఇంటికో కారు అన్నట్లుగా పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫైనాన్స్ కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి తక్కువ డౌన్ పేమెంట్‌తో కార్లు డెలివరీ ఇచ్చేస్తున్నారు. వివిధ అవసరాలు, కార్యాలకు వెళ్లాలంటే సొంతకార్లు, బంధువుల వద్ద ఉండే కార్లను వాడుతున్నారు. అయితే, అనుభవజ్ఞులు కాకుండా కాస్తోకూస్తో డ్రైవింగ్ వచ్చిన వాళ్లు వాహనాలను రోడ్లపైకి తీసుకువస్తున్నారు. దీంతో వేగం నియంత్రించలేక, రద్దీలో వాహనం నడిపే నైపుణ్యం లేకుండా, అధిక సమయం నిద్ర మేల్కొని వాహనాలు నడపలేక ప్రమాదాల బారిన పడుతున్నారు.

● బ్లాక్ స్పాట్‌లపై కానరాని దృష్టి

గడిచిన మూడేళ్లలో ముగ్గురు కంటే ఎక్కువగా ఒకే ప్రాంతంలో ప్రమాదంలో మరణించి ఉంటే ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. ఈ బ్లాక్ స్పాట్‌లలో ప్రమాదాల నివారణతోపాటు ప్రమాదాలను తగ్గించడం కోసం జిల్లా రహదారి భద్రతా మండలి సమావేశం ఏర్పాటు చేసుకొని చైర్మెన్ కలెక్టర్, వైస్ చైర్మన్ ఎస్పీ, కన్వీనర్‌లతోపాటు సభ్యులు పాల్గొని నివారణ చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేస్తారు. అయితే, తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో మాత్రం అధికారులు చేతులెత్తేస్తున్నారు. వాహనాల స్పీడ్‌ను తగ్గించలేక పోవడం, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని అదుపు చేయడం, రోడ్డు పక్కన ఇష్టానుసారం పార్కింగ్‌ను నిలువరించక పోవడం, బ్లాక్ స్పాట్‌లలో నిరంతరం పోలీసు సిబ్బంది ఉండక పోవడం ఇలా అధికారులు నివారణ చర్యలపై దృష్టి సారించక పోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతూ ఉంది. ప్రధానంగా ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పూర్తిగా లోపించింది. జాతీయ రహదారిపై విధులు నిర్వహించే పోలీసులు చెట్ల నీడన విశ్రాంతి తీసుకోవడం, హైవేపై ఉన్న దాబాలు, దుకాణాల వద్ద నెల మామూళ్లు తీసుకుంటూ రోడ్డుపక్కన ఆపే వాహనాలను కనీసం హెచ్చరించడం లేదన్న విమర్శలున్నాయి. రవాణా శాఖాధికారులు కొన్ని పాయింట్లకే పరిమితం అవుతూ చలానాలు, మామూళ్లపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు సమావేశాలకే పరిమితం కాకుండా రహదారులపై నిత్యం తనిఖీలు చేస్తూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



జాతీయ రహదారిపై గ్రీన్‌సిటీ వైపు తెరిచి ఉన్న మార్గం

ఆ మార్గమే కారణమా!?

నెల్లూరులోని ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం సంచలనంగా మారింది. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం పరిశీలిస్తే జాతీయ రహదారిపై అటు ఇటుగా వెళ్లే మార్గమని స్పష్టమవుతుంది. కొన్ని నెలల క్రితం నగరంలోని గ్రీన్‌సిటీ నుంచి ఎన్టీఆర్ నగర్ వైపు వెళ్లే జాతీయరహదారిని పూర్తిగా మూసివేశారు. అయి తే కొద్ది రోజుల క్రితం ఈ మార్గాన్ని తెరిచారు. దీని వెనుక రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఉన్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే గ్రీన్‌సిటీ నుంచి ఎన్టీ ఆర్‌నగర్ వైపు బైక్‌పై వస్తున్న ఓ యువకుడు యూటర్న్ తీసుకునే క్రమంలో వెనుక వస్తున్న వా హనాన్ని గమనించక పోవడంతో జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, నలుగురు గాయాలపాలయ్యారు. హైవేపై ఆ మార్గం తెరవక పోతే ఈ ప్రమాదమే జరిగేది కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా, బుధవారం రాత్రి ఈ మార్గాన్ని అధికారులు మూసివేశారు.

● పరారీలో మినీ కంటైనర్ డ్రైవర్

ఎన్టీఆర్ నగర్ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన మినీకంటైనర్ డ్రైవర్ శ్రావణ్‌కుమార్ యాదవ్ పరారీలో ఉన్నాడు. ఆ ప్రమాదంలో గాయాలపాలైన నలుగురిలో ముగ్గురు కోలుకుంటుండగా, లైన్‌మన్ అనీల్ తలకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. 24 గంటలు గడిస్తే తప్ప ఏమీ చెప్పలేమని వైద్యులు చెప్పినట్లు సమాచారం.

● క్షతగాత్రులకు ఉచిత వైద్యం

నెల్లూరు (వైద్యం) : నగరంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాధితులకు ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఉచిత వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు ఆ పథకం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్ భరోసా ఇచ్చారు. బుధవారం జిల్లా మేనేజర్ వెంకటమురళితో కలిసి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, మాట్లాడారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాలపై జిల్లా జడ్జి సమావేశం

ఇటీవల వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం పలుశాఖల అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జిల్లాలో రోజూ జరుగుతున్న యాక్సిడెంట్ కేసులు, ట్రాఫిక్, పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలానాలు, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై ఇలా పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి కే వాణి, మున్సిపల్ కమిషనర్ నందన్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కనకాద్రి, ఇన్‌చార్జ్ ట్రాఫిక్ డీఎస్పీ గిరిధర్, ఇన్‌చార్జ్ ఆర్డీవో బాలమురళీకృష్ణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

మాయా పెట్టెతో పాఠాలు

- పాఠశాలలకు చేరిన 658 నైపుణ్య కిట్లు
- ఒక్కో కిట్‌లో 62 ఆట వస్తువులు





నెల్లూరు(విద్య), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులకు ఆటల ద్వారా పాఠాలు బోధించేలా ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వారిలో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు 'జాదూయి పిటారా'(మాయా పెట్టె) కిట్లు అందచేస్తోంది. సృజనాత్మకత, ఆలోచనాశక్తి, సంభాషణ నైపుణ్యాలను పెంచి చిన్నారులకు అభ్యసనాన్ని ఆనందదాయకంగా చేయడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. బొమ్మలు, పజిల్స్, కథలు, ఫ్లాష్‌కార్డులు, తోలుబొమ్మలతో ఆడుకుంటూ అక్షరాలు, అంకెలు, రంగులు, ఆకారాలను నేర్చుకునేలా తరగతులు నిర్వహించనున్నారు.

● విజయవంతం చేస్తాం..

కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వీటిని పాఠశాలల్లో అమలు చేస్తోంది. జాతీయ విద్యావిధానంలో సూచించిన ఫౌండేషన్ స్టేజ్ పిల్లల కోసం రూపొందించబడిన ఈ కార్యక్రమం విజయవంతం చేస్తామని అధికారులు చెపుతున్నారు. చిన్నారులు విద్యలో పుస్తకాల కంటే అనుభవం, ఆటలు, కథలు, పాటలు, చిత్రాలు ద్వారా నేర్చుకోవడం ఎంతో ఫలప్రదమని భావించి ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది.

● జిల్లాకు 658 కిట్‌లు

జిల్లాలోని 658 పాఠశాలలకు ఒక్క కిట్ చొప్పున మంజూరు కాగా, ఒక్కో దానిలో 62 రకాల ఆట పరికరాలను ఏర్పాటు చేశారు. వీటిలో రంగుల బొమ్మలు, బోధనోపకరణాలు, అంకెలు, అక్షరాలు, రంగుల పెన్సిళ్లు, తెలుగు, ఆంగ్ల భాషలతో కూడిన అక్షరాలు, గణిత అంశాలను సులువుగా గుర్తించడానికి ఆకారాలను అందుబాటులో ఉంచారు. వీటిని అంగన్‌వాడీ కేంద్రాలకు అనుబంధంగా ఒకటి, రెండు తరగతులున్న పాఠశాల విద్యార్థుల సంఖ్యను బట్టి ఒకటి లేదా రెండు కిట్లు అందిస్తున్నారు.

నైపుణ్యాలను పెంచేందుకే...

చిన్నారుల్లో విద్యా నైపుణ్యాలకు పునాది వేయడమే కాకుండా సామాజిక, భావోద్వేగ అభిజ్ఞాన సామర్థ్యాలు, ఇంద్రియ గ్రహణ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. ఉపాధ్యాయులు ఈ కిట్‌ను సమర్థవంతంగా వినియోగించడం వల్ల విద్యార్థులు మెరుగైన అభ్యసనా ఫలితాలు సాధించేలా చేస్తాం.

- వెంకట సుబ్బయ్య, సమగ్రశిక్ష కోఆర్డినేటర్

ఇమామ్, మౌజన్ల వేతనాలకు రూ.90కోట్లు

● ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపించిందని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఇమామ్, మౌజన్లకు నెలకు రూ.15వేలు చొప్పున గౌరవ వేతనాలు చెల్లించేందుకు, 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రూ.90కోట్లు విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024 ఏప్రిల్, మే, జూన్ నెలలతోపాటు 2025 జనవరి నుంచి సెప్టెంబరు వరకు గౌరవ వేతనాలు మంజూరు చేసిందని పేర్కొన్నారు. సమాజంలో సద్భావన, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించేందుకు కృషి చేస్తున్న రాష్ట్రంలోని వేలాది ఇమామ్‌లు, మౌజన్‌లకు ఇది ఎంతో ఉపశమనం కలిగించే చర్య అని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ప్రతి అర్హుడి చేతికి సకాలంలో చేరేలా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటున్నారని, సమాజ అభివృద్ధి కోసం ప్రతి సామాజిక వర్గాన్ని సమానంగా చూసే నాయకుడు ఆయనని కొనియాడారు. చంద్రబాబు దూరదృష్టి, పరిపాలన నైపుణ్యం, అనుభవం వల్లే మైనార్టీల అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమ శాఖ మంత్రి ఫరూర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జీజీహెచ్ ప్రాంగణంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ జనరల్ వైద్యశాల (జీజీహెచ్) ప్రాంగణంలో బుధవారం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల విచారించినా మృతుడు ఎవరనే వివరాలు తెలియలేదు. దీంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440700018 నెంబరుకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ కల్యాణరాజు కోరారు.



వృద్ధుడి మృతదేహం

ఆత్మకూరు
ఉదయగిరి

నేడు రక్తదాన శిబిరం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో గురువారం జేవీవీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ పిడుగు చెన్నకేశవులు, మండల ప్రధాన కార్యదర్శి డీవీ రమణయ్య తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మిత శ్రీనివాసులురెడ్డి పాల్గొంటారన్నారు. ముందుగా రక్త గ్రూపు తెలిపి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే రక్తదానం చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు ఓడీ సౌకర్యం కల్పిస్తామన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11840
వెండి కిలో ధర	రూ. 161100
వెండి ఒక గ్రాము	రూ. 167.10

C.R.I.M.E N.E.W.S

వృద్ధురాలిపై దాడి, దోపిడీ

● కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో దారుణం
● 12 సవర్ల బంగారు ఆభరణాల చోరీ

నెల్లూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ వృద్ధురాలిపై కొందరు దుండగులు దాడి చేసి ఆమె మెడలోని బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. సేకరించిన సమాచారం మేరకు.. హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎంఐజీ ఇళ్లలో కేసరి రుక్మిణమ్మ (73) ఒంటరిగా జీవిస్తున్నారు. ఆమె తమ్ముడు శ్రీనివాసులు అదే ప్రాంతంలో మరో చోట ఉంటున్నారు. మంగళవారం రాత్రి 9.30 గంటల వరకు అక్కతో ఉన్న ఆయన ఆ తర్వాత తన ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం రుక్మిణమ్మ ఇంటి గేటు వేస్తుండగా ముగ్గురు దుండగులు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి కొట్టారు. ఆమె ఒంటిపై ఉన్న 12 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. గాయపడిన వృద్ధురాలిని గుర్తించిన చుట్టుపక్కల వారు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై తమకు సమాచారం అందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ గుంజి వేణు బుధవారం తెలిపారు. ఈ దోపిడీ ఘటన చుట్టుపక్కల ప్రాంతాల్లో అలజడి రేపింది.

బత్తులపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

పొదలకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బత్తులపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఆనంద్‌రెడ్డి, అశోక్ రెడ్డిలు, వారికి సంబంధించిన సిమెంటు, ఇనుప కమ్ములను గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల భవనంలో నిల్వ ఉంచారు. అయితే ఇటీవల సచివాలయానికి యూరియా రావడంతో ఆ యూరియా భద్రపరచడానికి అదే స్కూల్ భవనాన్ని వ్యవసాయ శాఖ అధికారులు ఎంపిక చేశారు. దీంతో అక్కడ ఉన్న సిమెంటు, ఇనుప కమ్ములను ఖాళీ చేయమని కోరగా వారు ఖాళీ చేసే సమయంలో ఈ బడికి గేటు కూడా తామే పెట్టించామని, వీటితో పాటు బడికికూడా తీసుకెళ్లామని చెప్పారు. దీంతో అక్కడ ఘర్షణ నెలకొంది. ఇనుప గేట్‌ను ఊడగొడితే అడ్డొచ్చిన వారిని గడ్డపారతో పొడుస్తామని బెదిరించారు. దీంతో గ్రామ టీడీపీ నాయకుడు శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హనీఫ్ తెలిపారు.

జూద స్థావరంపై దాడి

ఉదయగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆనకట్ట సమీపంలో గల పాత బాణసంచా గోదాము వద్ద నిర్వహిస్తున్న జూదస్థావరంపై మంగళవారం రాత్రి ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడలో ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, రూ.5 వేలు నగదును స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లికి రావినూతల నవ్య అదృశ్యమైనట్లు తండ్రి వెంకటేశ్వర్లు బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు, నవ్య స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతుంది. మంగళవారం కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదుజ ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వస్తుంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ముఖం కడిగించి, పంపండి : ఎస్పీ అజిత

● 'ఫేస్‌వాష్ అండ్ గో' పరిశీలన



ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరుగకుండా సురక్షిత ప్రయాణం కోసం ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు అర్ధరాత్రి దాటిన తర్వాత వాహనాలు నడిపే డ్రైవర్లను ఆపి నీళ్లతో ముఖం కడిగించి పంపించాలని (ఫేస్‌వాష్ అండ్ గో) ఎస్పీ డాక్టర్ అజిత సూచించారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి పూట జరుగుతున్న ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద ఆమె పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాత్రిపూట జాతీయ రహదారులపై తిరిగే ట్రావెల్స్ బస్సులు, లారీలు, వ్యాన్లు, ఇతర వాహనాల డ్రైవర్లను అప్రమత్తం చేస్తూ ఫేష్‌వాష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

● జిల్లావ్యాప్తంగా వైసీపీ శ్రేణుల ఆందోళనలు

నెల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలలను ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారం జిల్లావ్యాప్తంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు. నియోజకవర్గాల ఇన్‌చార్జులు ఈ ఆందోళనను ప్రతిష్ఠాత్మకంగా భావించి జనాన్ని సమీకరించారు. ఆయా కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టి, అధికారులకు వినతిపత్రం అందజేశారు. పేద విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేందుకు, పేదలకు మెరుగైన వైద్యం ఉచితంగా అందించాలన్న దృక్పథంతో రాష్ట్రంలో 15 వైద్య కళాశాలలను స్థాపించారని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం ఆ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. జీవోను రద్దు చేసి మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కావలిలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి వైసీపీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఆర్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కందుకూరులో వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉదయగిరిలో జరిగిన ఆందోళనకు మేకపాటి అభినవ్‌రెడ్డి సారథ్యం వహించారు. నెల్లూరు సిటీలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి నుంచి వెంకటాచలం తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ఆందోళనలో వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, కార్యకర్తలు పాల్గొన్నారు. నెల్లూరు రూరల్‌లో వైసీపీ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బారాషహీద్ దర్గా నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కోవూరులో మాజీ ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వింజమూరులో ట్రాఫిక్ కష్టాలు

వింజమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణం అభివృద్ధి చెందుతూ పలు విద్యా సంస్థలు విస్తరిస్తున్న తరుణంలో ప్రజలను ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా పాతబస్టాండ్, కొత్త బస్టాండ్ బంగ్లా సెంటర్ కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు జటిలం అయ్యాయి.విద్యా సంస్థలు పట్టణంలో పెరిగి, విద్యార్థులు స్కూలు వదిలినప్పుడు ఆయా కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. అలాగే రోడ్డు పక్కన వాహనాలను వదిలివేయడం, రోడ్డును ఆక్రమించేసి రేకుల షెడ్లను వేయడంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని ప్రజలంటున్నారు. సాయంత్రం 6గంటల నుంచి జనసంచారం ఎక్కువగా ఉండడం, రోడ్డు కుంచించుకుపోవడం వలన ప్రజలు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందిపడుతున్నారన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

శిథిల భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

● పెచ్చులూడుతున్న భవనాల శ్లాబులు ● అవస్థలు పడుతున్న అధికారులు, ప్రజలు

ఏఎస్ పేట, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీవో,తహసీల్దార్ కార్యాలయాల భవనాలు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో అక్కడికి వచ్చే అర్జీదారులు అవస్థలు పడుతున్నారు. శ్లాబు పెచ్చులుడిపడుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

● పెచ్చులూడుతున్న భవనం

ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని 1987లో నిర్మించారు.సుమారు 4దశాబ్దాలు గడుస్తుండడంతో శ్లాబు దెబ్బతింది.కార్యాలయంలో పలు రూముల్లో శ్లాబులు అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా స్టాఫ్,కంప్యూటర్ రూములలో శ్లాబు పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడి పడుతున్నాయి.దీంతో శ్లాబు లోపల ఉండే ఇనుప కమ్మీలు బయటపడ్డాయి.కార్యాలయ వరండాలోను ఇదే పరిస్థితి.

● తహసీల్దారు కార్యాలయంలోనూ..

అధికారులు విధులు నిర్వహించే కంప్యూటర్, స్టాఫ్ రూములలో శ్లాబు నుంచి తరచూ పెచ్చులూడి పడుతుండడంతో ఎక్కడ అవి తమపై పడతామోనని ప్రజలు, అధికారులు భయాందోళన చెందుతున్నారు.మోల్డింగ్ లోపల ఉండవలసిన ఇనుప కమ్మీలు పెచ్చులు బయట పడ్డాయి.దీంతో వర్షం కురిస్తే శ్లాబుతో పాటు గోడలలోకి వర్షం నీరు చేరి తేమగా ఉంటున్నాయి.





ఎంపీడీవో భవనంలో పెచ్చులూడి కమ్మీలు బయటపడ్డ శ్లాబు, తహసీల్దార్ కార్యాలయంలోని ఓ రూములో దెబ్బతిన్న ఫ్లోరింగ్

బుక్కాపురంలో ఎమ్మెల్యే కాకర్ల గృహాల ప్రారంభం

వింజమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల ఇళ్లలో ప్రవేశాల సందర్భాన్ని పురస్కరించుకని మండలంలోని బుక్కాపురం గ్రామంలో బుధవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గృహ ప్రవేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు 3లక్షల ఇళ్లను నిర్మించి నేడు ప్రజలకు అందిస్తున్నదని తెలిపారు. అందులో భాగంగా బుక్కాపురంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ చేబ్రోలు వసంతరావు, హౌసింగ్ డీఈ పి.రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు సందీప్‌రాజు, పోలయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు బాలాజీ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్ల ప్రమాణ స్వీకారం

ఉదయగిరి నియోజకవర్గంలోని టీడీపీ బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్ల ప్రమాణ స్వీకారం బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల అధ్యక్షత వహించారు. నియోజకవర్గంలోని 8 మండలాల ప్రధాన నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, మహిళా నాయకులు, వేలాదిమంది కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమేకాదని, ఇది లక్షలాది మంది కార్యకర్తల ఆశయాలు, ఆత్మీయులు మిళితమైనపార్టీ అని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తలకు, ప్రతి నాయకుడికి తగిన గుర్తింపు, గౌరవం దక్కేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు ఇంటి తాళం అందచేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఉదయగిరి : రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం దారుణమని నియోజకవర్గ వైసీపీ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పట్టణంలోని ఆనకట్ట వద్ద గల వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, పంచాయతీ బస్టాండ్ మీదుగా తహసీల్దారు కార్యాలయం వరకు వైసీపీ నాయకులు, నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్లు కొండా రాజగోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వాసుదేవరెడ్డి, వైసీపీ నాయకులు అలీఅహ్మద్, దస్తగిరిఅహ్మద్, ఎంఏ సలీం, అక్కిభాస్కర్‌రెడ్డి, షంషీర్, శ్రీనివాసులరెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీత పనులు

కలువాయి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు సోమశిల దక్షిణ కాలువ ఆయకట్టు పరిధిలోని ప్రధాన కాలువల్లో పూడికతీతను బుధవారం సోమశిల ప్రాజెక్టు అధికారులు ప్రారంభించారు. కలువాయి చెరువు నుంచి ఆయకట్టుకు నీరందించే సారవ వాగు దగ్గర నుంచి కింది ఆన వరకు పూడిక తొలగింపుతో పాటు కలువాయి చెరువు పడమటి అలుగు గోడలకు మరమ్మతులు కూడా చేపట్టారు. సోమశిల దక్షిణ కాలువ 6.85కిలో మీటరు నుంచి 7.300కిలో మీటరు వరకు పూడికను తొలగించే పనులు జరుగుతున్నాయి. ఈ నెల 15 నాటికి యుద్ధప్రాతిపథకన పనులు పూర్తి చేస్తామని ఏఈ నారాయణరాజు తెలిపారు. ఈ పనులను సోమశిల ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ చల్లా విజయభాస్కర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.



కాలువలో పూడిక తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

టీడీపీ మండల అధ్యక్షుడిగా రఘురామిరెడ్డి

కలువాయి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడిగా కలువాయికి చెందిన చల్లా రఘురామిరెడ్డి ఎంపికయ్యారు. బుధవారం వెంకటగిరిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మండల పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతోపాటు మండల కమిటీలో సభ్యులుగా గుండపనేని హరిబాబు, గోపిదేశి పెంచలయ్య, కొలపనేని లక్ష్మీనారాయణ, కసిరెడ్డి ప్రేమ్‌కుమార్, ఇండియాల శ్రీనివాసులు, గొలపల్లి నరసింహులు, పంచిటి రాజేష్‌ను నియమించారు.



ఎమ్మెల్యే కురుగొండ్లకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న చల్లా రఘురామిరెడ్డి

రిటైర్డ్ టీచర్ మృతికి సంతాపం

ఉదయగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం బాలుర గురుకుల పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన షేక్ నజిమొహిద్దీన్, ఆయన కుమారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి ముజాహిద్‌అలీలు మంగళవారం నెల్లూరులో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి మృతికి కొద్దిసేపు మౌనం పాటించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

నేడు రాజకీయ పార్టీల సమావేశం

ఉదయగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మురళి సమీక్ష నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారిణి షాజియా బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె తెలిపారు.

ర్యాలీ, సభను విజయవంతం చేయండి

ఉదయగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ గురువారం ఉదయగిరి పట్టణంలో నిర్వహించే భారీ ర్యాలీ, బహిరంగ సభలను విజయవంతం చేయాలని ఉదయగిరి డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు షేక్‌ఎండీ ఖాజా, శ్రీరామచంద్రమూర్తిలు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అయితే మంత్రివర్గ ఉపసంఘం ఎలాంటి ప్రతిపాదన చేయకుండా మొండిచేయి చూపడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉదయగిరిని డివిజన్ చేయాలని వారు కోరారు.

టీడీపీ పటిష్టతే లక్ష్యంగా పనిచేయాలి



చేజర్లలో ప్రమాణ స్వీకారం చేసిన టీడీపీ నాయకులు

చేజర్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి). గ్రామస్థాయి నుంచి టీడీపీ పటిష్టమే లక్ష్యంగా మండల కమిటీ సభ్యులు పని చేయాలని చేజర్ల మండల పార్టీ అధ్యక్షుడు షేక్. సిరాజుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సాయి కల్యాణ మండపంలో మండల కమిటీ, క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ స్థాయి కమిటీల ప్రమాణస్వీకారం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవచౌదరి, పార్లమెంటరీ కమిటీ సెక్రటరీ రావి పెంచలరెడ్డి పాల్గొన్నారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ పార్టీ ఆశయాలకు అనుగుణంగా అందరూ కలసి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్నీ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వవైభవం తీసుకు వస్తా...



టీడీపీ మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులును సన్మానించిన పార్టీ నాయకులు

సీతారామపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకుని వస్తానని ఆ పార్టీ మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు అన్నారు. మండల కన్వీనర్‌గా ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సీతారామపురంలో భారీ ర్యాలీ నిర్వహించి, కేక్ కట్‌చేశారు. అనంతరం చింతల మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీపీ, ఏడు ఎంపీటీసిలు, 14 పంచాయతీ సర్పంచి పదవులను టీడీపీ గెలుచుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

సీతారామపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కురవ వీధి, బస్టాండ్ సెంటర్, తోటవీధుల్లో పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ పంచాయతీలోని ప్రతి వీధిలో ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని. రోడ్లపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో 6వ వార్డు సభ్యుడు బండి రవికుమార్ పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

సీతారామపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మారంరెడ్డిపల్లి సొసైటీలో యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ సోమనబోయిన రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సొసైటీకి 400 బస్తాల యూరియా వచ్చి ఉన్నదని, గురువారం ఉదయం నుంచి రైతులకు అందజేస్తామన్నారు.ఒక్కోబస్తా ధర రూ. 267.50 వంతున అందచేస్తామన్నారు.

మరమ్మతులు... మూణ్నాళ్ల ముచ్చటే...!

● నాసిరకంగా రోడ్డు రిపేర్లు ● అవస్థల్లో ప్రజలు

ఉదయగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుంతలు లేని రహదారులను తీర్చిదిద్దాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా, ఆ మాటలు అధికారుల చెవిన పడడం లేదు. నూతన రహదారులు, మరమ్మతులకు మంజూరు చేస్తున్న నిధులు బూడిదలో పోసిన పన్నీరుగా మారుతున్నాయి. ఇటీవల మండలంలోని గండిపాళెం, సున్నంవారిచింతల, గంగిరెడ్డిపల్లి గ్రామాల సమీపంలోని ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారిలో మరమ్మతుల పేరుతో చేపట్టిన ప్యాచ్ వర్కులు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలాయి. పర్యవేక్షణ లోపమో, కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరో ఏమోగానో కురిసిన వర్షాల పుణ్యమాని నాసిరకం పనుల బాగోతం వెలుగు చూసింది. ఛిద్రంగా మారిన రహదారిలో ఎక్కడ జారి పడాల్సి వస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు.



గండిపాళెంలో ఛిద్రమైన రహదారి

సొసైటీ పథకాలపై అవగాహన



సొసైటీలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళా బృందం

సంగం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో పీఏసీఎస్ ద్వారా చేపడుతున్న ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత పథకాలపై కళాజాతా బృందాలతో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బృందం వివిధ వేషధారణలో పథకాలపై పాటలు, నాటక రూపంలో అవగాహన కల్పించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసుల మాట్లాడుతూ సహకార బ్యాంకు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పిట్టు పట్టాభిరామిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిరండి



ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తున్న టీడీపీ నాయకులు

సంగం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వర కల్యాణ మండలంలో గురువారం జరిగే టీడీపీ మండల కమిటీ, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారానికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మండల పార్టీ అధ్యక్షులు బాబా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం కల్యాణ మండపంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 3-00గంటలకు మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుండ్లపల్లి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు, విజయచంద్ర, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర యోగా పోటీలకు కీర్తి



ఆత్మకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నెల్లూరులో జరిగిన జిల్లాస్థాయి అండర్- 17 యోగాసనాల విభాగంలో ఆత్మకూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశా విద్యార్థిని బీ. కీర్తి సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 23, 24 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఆమె పాల్గొననున్నది. శిక్షణ ఇచ్చిన పీడీలు ేపే. సుమతి, నిహారికలను ప్రధానోపాధ్యాయురాలు కే కోటేశ్వరమ్మ అభినందించారు.

16న సీతారాముల ఆలయ వార్షికోత్సవం

ఉదయగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లిలో శ్రీసీతారాముల ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 16న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా స్వామివారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, అభిషేకాలు, విశేష అలంకరణ తదితర పూజా కార్యక్రమాల తోపాటు స్వామివార్లకు కల్యాణోత్సవం, అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

పైర్ల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఉదయగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వివిధ పైర్ల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి, అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ తెలిపారు. బుధవారం మండలంలోని కొండాయపాళెం, ఉదయగిరి-1 రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలు సాగు చేసే ప్రతిరైతు విత్తనశుద్ధి చేపట్టాలన్నారు. పంటల సాగులో రసాయనిక ఎరువుల మోతాదు తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడాలన్నారు. అనంతరం సాగులో పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు.

మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న ఎస్‌ఏ-1 పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో-1 టీ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం మండలంలో వెంకట్రావుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు లక్ష్యాన్ని సాధించాలన్నారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 600

రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ఇంజనీరింగ్ శాఖల రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ రామ్‌రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పీ.సుబ్రహ్మణ్యం, కోశాధికారి సీఎం వరకుమార్‌లు బుధవారం కందుకూరులో అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఉద్యోగ విరమణ చేసిన వారు, రానున్న రెండు మూడు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న వారందరినీ అసోసియేషన్‌లో సభ్యులుగా చేర్పించటమే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ స్థానిక ప్రతినిధులు మురళీమోహన్, మాలకొండయ్య, పొనుగోటి మాలకొండయ్య, అగస్టీన్, అంకయ్య, ఇంటూరి మాల్యాద్రి, హసన్‌సాహెబ్, ఆల్ఫ్రెడ్ తదితరులు పాల్గొన్నారు.

గృహాల మధ్యలో..
• ప్రబలుతున్న విషజ్వరాలు
• భయాందోళనలో ప్రజలు

నీటి మడుగులు!


కేసరిగుంట కాలనీలో నివాసగృహాల మధ్య నిలిచిన నీరు

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో నివాసాల మధ్య ఖాళీస్థలాల్లో నిలిచిన వర్షపు నీరు ప్రమాదకరంగా మారింది. ఖాళీ స్థలాల్లో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు వాటిలో చిన్నపాటి చెరువులను తలపించేలా నిలిచిన నీటితో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దీంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. శివారు కాలనీలతో పాటు పట్టణంలోకెల్లా అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాలుగా, విలాసవంతమైన భవనాలు నిర్మించి ఉన్న ప్రాంతాల్లో కూడా ఈ పరిస్థితి నెలకొంది. ఇక డ్రైనేజీ వ్యవస్థ సరిలేని కొన్ని ప్రాంతాల్లో అయితే చెరువుల్లో గృహాలు నిర్మించుకున్నారా అనిపించేలా నేటికీ వర్షపు నీరు దర్శనమిస్తోంది. పట్టణంలోని కేసరిగుంట కాలనీ, శ్రీనగర్ కాలనీ, తూర్పు ఎర్రగుంటపాలెం, డీవీ నగర్, కోటారెడ్డి నగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి వర్షపు నీరు నివాసాల మధ్య మోకాటిలోతున నిలిచి ఉంది. అలాగే సింహాద్రినగర్, సాయినగర్, ఉప్పుచెరువు కాలనీ, ఏకలవ్యనగర్, మహదేవపురం జగనన్న కాలనీ తదితర ప్రాంతాల్లోనూ నివాసాల మధ్య ఖాళీస్థలాలు చెరువులను తలపిస్తోన్నాయి.

• డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

పట్టణంలోని అనేక ప్రాంతాల్లో వర్షపునీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఉన్న డ్రైనేజీలను ఆక్రమించి ఉండటంతో ఈ దుస్థితి ఏర్పడింది. కేసరిగుంట కాలనీ నుంచి వర్షపునీరు పామూరురోడ్డులోకి వెళ్లేలా ఉన్న డ్రైనేజీ ఆక్రమణలకు గురవ్వడం, అంతర్గత రహదారుల మధ్య లింకు డ్రైనేజీ వ్యవస్థ సరిలేకపోవడంతో ఆప్రాంతంలో ప్రతిఏటా వర్షాకాలం మూడు నాలుగు నెల లు ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఇక నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో నిలిచిన నీరు డ్రైనేజీలకు వెళ్లే వ్యవస్థ లేకపోవడం, మున్సిపల్ పారిశుధ్య విభాగం సిబ్బంది కానీ ఇంజనీరింగ్ సిబ్బంది కానీ ఇవేమీ పట్టించుకోకుండా వర్షాకాలంలో ఆయిల్‌బాల్స్ వేయడం, దోమల నివారణ మందు స్ప్రే చేయడంతో మమ అనిపిస్తుండటంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. అలాగే ఉప్పుచెరువు అలుగు వాగు, పంటకాలువలు వెంచర్లతో ఆక్రమణలకు గురవ్వడంతో ఇటీవల కురిసి న వర్షాలతో పలు కాలనీలను వరదనీరు ముంచెత్తిన విషయం తెలిసిందే. అయితే తాత్కాలిక చర్యలతో సరిపెట్టారే తప్ప సమస్యకు మూలం అర్థమైనా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రబలుతున్న విషజ్వరాలు

ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల తర్వాత పట్టణంలో వైరల్‌జ్వరాలు, విషజ్వరాలు ప్రబలుతున్నాయి. తీవ్రమైన జలుబులు, ఒళ్లునొప్పులతో పాటు జ్వరాలతో ప్రజలు మంచం పడుతున్నారు. విషజ్వరాల కారణంగా డెంగ్యూ లక్షణాలు, ప్లేట్‌లెట్స్ పడిపోతుండడంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలకు వేలు, లక్షలు వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన సింహమణి అనే యువకుడు డెంగ్యూ లక్షణాలతో ఇటీవల మృతి చెందడంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతోన్నాయి. వర్షాల తర్వాత పట్టణంలో పారిశుధ్య నిర్వహణ కూడా అంతంతమాత్రంగా మారిందని, దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో నివాసాల మధ్య నిలిచిన వర్షపునీటిలో డెంగ్యూ కారక దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, డెంగ్యూ ప్రబలితే మా పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస గృహాల మధ్య నిలిచి ఉన్న వర్షపునీరు వెళ్లిపోయేలా ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు జ్వరాలు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటా

• కమిటీలతో ప్రమాణస్వీకారం చేయించిన ఎమ్మెల్యే


ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణస్వీకారం చేస్తున్న రూరల్ మండల టీడీపీ నేతలు

కావలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే పార్టీకి కొండంత బలమని, వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని రూరల్ మండలం, బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల మండల కమిటీల అధ్యక్షుడు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, కో ఇన్‌చార్జిలు మండలాల వారీగా ఎమ్మెల్యే అధ్యక్షతన పార్టీ పరిశీలకులు దొడ్ల సుబ్బారెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలు, నేతలకు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు బాగుంటేనే పార్టీ గెలుస్తోందన్నారు. పార్టీలో నిబద్ధత, నిజాయితీతో పని చేసే వారికి ఎల్లప్పుడు తాను అండగా ఉంటానన్నారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ ఇచ్చిన బాధ్యతలను అందరం కలిసి నెరవేర్చుదామన్నారు. ప్రజా సమస్యలపై చురుకైన పాత్ర పోషించాలన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ప్రజల మన్ననలు పొందిన పార్టీగా నిలవడానికి కారణం కార్యకర్తల కష్టమేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాలలో కావలి నియోజకవర్గంలోని వివిధ మండలాల అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు, క్లస్టర్, కోక్లస్టర్ ఇన్‌చార్జిలు, కో యూనిట్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 13న జగన్నాథ రథయాత్ర

• బ్రోచర్ ఆవిష్కరించిన ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుఖ్‌దేవ్ స్వామి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుఖ్‌దేవ్ స్వామి

కావలి(టౌన్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యావత్ జీవకోటి అనుగ్రహం కోసమే జగన్నాథ రథయాత్ర అని ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుఖ్‌దేవ్‌స్వామి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రామ్మూర్తిపేటలో ఉన్న ఇస్కాన్ మందిరంలో రథయాత్రకు చెందిన బ్రోచర్లు, కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. అనంతం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 13న కావలి పట్టణంలో జరగనున్న రథయాత్రలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ప్రజల్లో దైవభక్తి తగ్గిపోతుందని, మన భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతి పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సనానత ధర్మం, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక చింతన అలవర్చేందుకు జగన్నాథ రథయాత్ర దోహదపడుతుందన్నారు. ఎంతో దూరంలోని ఒడిశా రాష్ట్రం పూరీలో వెలసివున్న జగన్నాథుడి రథయాత్రలో పాల్గొనలేని భక్తులు డిసెంబరు 13న కావలిలో జరిగే యాత్రలో పాల్గొంటే పుణ్యఫలం దక్కుతుందన్నారు. దేశం నలుమూలల నుంచి ఇస్కాన్ ప్రముఖులు హాజరౌతారని, స్థానికుల సహకారంతో ఈ యాత్ర జరుతుందన్నారు. సమావేశంలో ఇస్కాన్‌కు చెందిన చంద్రశేఖర్ దాస్, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కమీషన్ల పేరుతో పేదల సొమ్ము దోచేశారు

• మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిపై ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆగ్రహం • బుడంగుంటలో ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు పక్కా గృహాల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి కమీషన్లకు కక్కుర్తి పడి ఊరికి దూరంగా కాలుతో తంతే కిందపడే ఇళ్లు కట్టించి పేదల సొమ్ము దోచేశారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి అవాస్‌యోజన (అర్బన్) 2.0 పథకంలో భాగంగా మున్సిపాల్టీ పరిధిలో 342 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను బుధవారం బుడంగుంట గిరిజన కాలనీలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో కమీషన్ల కోసమే నివాసానికి పనికిరాని జగనన్న కాలనీలు కట్టి పేదల ఉసురు మూటకట్టుకున్నారన్నారు. అవి పనికి రాకుండా పోవడమే కాక ఆ లబ్ధిదారులకు మరో 20 ఏళ్ల వరకు కొత్త ఇళ్లు మంజూరు అయ్యే అవకాశం లేకుండా చేశారన్నారు. గతంలో బుడంగుంట, మద్దూరుపాడు, ముసునూరు కావలి మున్సిపాల్టీలో కలిపినప్పుడు వాటికి మంచి నీటి సరఫరా కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం అమృత్‌పథకంలో భాగంగా రూ.53 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి పైపులైన్లు వేయకుండా, కుళాయి కనెక్షన్లు ఇవ్వకుండా ఆ సొమ్ము స్వాహా చేశారన్నారు. దీంతో ఇప్పుడు పేదలకు కుళాయి కనెక్షన్‌లు ఇద్దామంటే రికార్డుల్లో ఇచ్చినట్లు చూపిస్తుందన్నారు. పేదలకు ఇచ్చే ఇళ్లు, వసతులకు సంబంధించిన నిధులు దోచేసిన పాపం ఊరికే పోదన్నారు. 2.0 పథకంలో భాగంగా ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1,50,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.1,00,000 మంజూరు చేస్తుందన్నారు. ఎస్సీలు, వీవర్స్‌లకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.50 వేలు, గిరిజనలుకు రూ.75 వేలు ఇస్తుందన్నారు. లబ్ధిదారులు పునాదులు వేసుకున్న తర్వాత తాను తన సొంత నిధులు రూ.5,000 ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావన్‌కుమార్, టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

• ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తన జన్మదిన వేడుకలను బుడంగుంట కాలనీలో పేదల మధ్య జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి పేదలకు పంచి పెట్టారు.

మనీ స్కాం బాధితులకు న్యాయం చేయాలి


మనీస్కాం బాధితులతో మాట్లాడుతున్న వేదిక నాయకులు

కావలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కావలి వ్యుసునవారు అనంతార్థ మనీ స్కాం బాధితులకు న్యాయం చేయాలని ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక నేతలు కోరారు. పట్టణంలోని మనీ స్కాం బాధితులను బుధవారం వేదిక సభ్యులు కలిసి విచారించారు. ఈ కేసులో తమకు ఏమీ తెలియదని బాధితులు తెలిపారు. తాము ఇచ్చిన కేసులు నమోదు అయ్యాయో కాలేదో కూడా తమకు తెలియవన్నారు. దీంతో మనీ స్కాం జరిగి సుమారు ఏడాది కావస్తున్నా బాధితులకు ఎటువంటి న్యాయం జరగలేదని వేదిక సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి స్కాంలో ఇరుక్కున్నవారు వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. బాధితులు ఎవరైనా తమకు జరిగిన అన్యాయాలపై వేదిక సభ్యులను కలిసి వివరాలు చెపితే ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు కరువది భాస్కర్, పీ.పెంచలయ్య, ఎల్ లక్ష్మీరెడ్డి, దమ్ము దర్గాబాబు, వై.క్రిష్ణమోహన్, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

• మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి


నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పతాప్‌కుమార్ రెడ్డి

కావలి(టౌన్), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో సన్నీ వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఆర్ఎస్ఆర్ మండపం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ట్రంకురోడ్డు మీదుగా బ్రిడ్జి కూడలి వరకు సాగి తిరిగి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంది. అక్కడ ప్రతాప్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు ఉచితంగా మెడికల్ విద్య అందించాలన్న దృక్పథంతో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తెచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఆ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. సీఎం చంద్రబాబు తన తొత్తులకు వాటిని కట్టబెట్టేందుకు తీసుకొచ్చిన ఈ జీవోను తక్షణం రద్దు చేసి మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు ధనుంజయ రెడ్డి, నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి నారాయణ, గంధం ప్రసన్న, కుందుర్తి కామయ్య, వేమిరెడ్డి విజయ్‌కుమార్ రెడ్డి, గయాజ్, నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

30 రోజుల్లో పరిష్కరించాలి : ఆర్డీవో


రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కలిగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై వచ్చిన అర్జీలను 30 రోజుల్లో పరిష్కరించాలని కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ భూ సమస్యలపై 80 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కోర్టు కేసులు మినహా మిగిలిన భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా సిబ్బందితో పని చేయించాలని తహసీల్దారు గిరీష్‌కు సూచించారు. అయితే రెవెన్యూ సదస్సు జరిగే విషయం తమ గ్రామాల్లో సమాచారం ఇవ్వనందున ఉదయం రాలేకపోయామని, వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులు తెలిపారు. సాయంత్రం వేళ భూ సమస్యలతో కార్యాలయానికి వెళితే తమ అర్జీలను సిబ్బంది స్వీకరించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బీ.లక్ష్మీఅక్షర రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో బంగారుపతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు జమ్మూకాశ్మీర్‌లో జరిగే పోటీలలో పాల్గొంటుందని తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్కే అబ్దుల్‌సలాం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లక్ష్మీఅక్షరను, కోచ్ అఖిల్‌ను డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం, విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జీ.బాలభాస్కర్, బీ.నరేంద్రబాబులు బుధవారం అభినందించారు.

ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయి

లింగసముద్రం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని మడల వ్యవసాయ అధికారి సీహెచ్‌వీఎల్ దుర్గ చెప్పారు. బుధవారం వీఆర్ కోట, అన్నెబోయినపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఏవైనా ఇబ్బందులుంటే సమీప రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. పీఎం కిసాన్‌పై ఫిర్యాదులను సేకరించారు. వీఏఏ వినయ్, ఉద్యాన సహాయకులు హరికృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీలో పాల్గొన్న బుర్రా మధుసూదన్ యాదవ్, తదితరులు

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా బుధవారం కందుకూరులో నిరసన ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వైసీపీ నియోజకవర్గ ఇంచార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ నేతృత్వంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్రా మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ పేరుతో తమ వర్గీయులకు అమ్ముకునేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కుట్రచేస్తున్నదని విమర్శించారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం అయితే పేదలకు ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలు కూడా సక్రమంగా అందవని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనను ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కందుకూరులో ఎమ్మెల్యే కార్యాలయం అవినీతిమయంగా మారిందని, ఇసుక, మట్టి రవాణా మొదలు కల్తీమద్యం, పేకాట శిబిరాల ద్వారా దండుకుంటున్నారని, పేదల బియ్యాన్ని బహిరంగంగా అమ్ముకుంటున్నారని విమర్శించారు. మున్సిపాలిటీలోను పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని మొత్తం వ్యవహారాలను త్వరలోనే బయటపెడతామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు షేక్ రఫీ, ఈదర రమేష్, నలమోతు చంద్రమౌళి, నున్నం పోతురాజు, అనుమోలు లక్ష్మీనరసింహం, నోటి వెంకటేశ్వరరెడ్డి, గణేశం గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరి పైరుకు ఆరుతడులుగా నీరు పెట్టాలి


వరి పైరును పరిశీలిస్తున్న ఏవో అబ్దుల్ రహీం

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వరిపైరు పొట్టదశకు వచ్చేవరకు ఆరుతడులుగా నీరు పెట్టాలని మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్‌రహీం తెలిపారు. మండలంలోని ఓగూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి వరిపైరును పరిశీలించారు. వరిలో యూరియా అధికంగా వాడితే అగ్గితెగులు సోకి రైతులు నష్టపోతారని, పైరు పిలకదశలో, ఎదిగేదశలో నీరు తక్కువగా ఆరుతడులు ఇస్తే ఎక్కువ పిలకలు వచ్చి అధిక దిగుబడులు సాధించవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు సుస్మిత, రైతులు పాల్గొన్నారు.

‘ప్రకాశం’లో ప్రాంగణ ఎంపికలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ హెచ్‌ఆర్ మేనేజర్లు, కాలేజీ కరస్పాండెంట్

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చెన్నైలోని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 30 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్ శ్రీనివాస్ తెలిపారు. మూడు దశల కఠినమైన ఎంపిక ప్రక్రియను తమ విద్యార్థులు సమర్థవంతంగా అధిగమించి ఉద్యోగాలకు ఎంపిక వడం నాణ్యమైన బోధనకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రవి కుమార్, అకడమిక్ ఇంచార్జి మీరావలి, అధ్యాపకులు విక్రమ్, సహిత్య, సుమలత, భరద్వాజ్‌లు అభినందించారు.


రక్తదాన ఉద్యమానికి స్ఫూర్తి ఆదినారాయణరెడ్డి


కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రక్తదాన ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి అని కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్ తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో బుధవారం ఆదినారాయణరెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రవిప్రకాష్ మాట్లాడుతూ రక్తం ఇవ్వాలంటే భయపడే రోజుల్లో ఆదినారాయణరెడ్డి 52 పర్యాయాలు రక్తదానం చేశారన్నారు. చెన్నైలోని పలు బ్లడ్ బ్యాంకులలో ఆదినారాయణరెడ్డి ఫొటో ఉండేదన్నారు. అయన ఎన్ని పర్యాయాలు రక్తదానం చేసినా సాటి మనిషిని కాపాడటానికి రక్తదానం చేయటం కనీస బాధ్యత అని మిత్రులతో చెప్పే వారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి కోఆర్డినేటర్ కలికి శ్రీహరిరెడ్డి, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ కే.హరినారపరెడ్డి, కార్యదర్శి బీఎస్ ప్రసాద్, సభ్యులు గాదంశెట్టి హరనాథ్, మురళీక్రిష్ణ, సురేంద్ర, ఎం.రమణయ్య పాల్గొన్నారు.

పులిరాజా.. నువ్వెక్కడ?

శేషాచలంలో తొలిసారి పులుల గణన
డిసెంబరులో మొదలు
ఏర్పాట్లు చేసుకుంటున్న అటవీశాఖ



మంగళం, ఆంధ్రజ్యోతి

శేషాచలంలో పెద్దపులి కోసం తొలిసారి అన్వేషణ మొదలవుతోంది. దేశవ్యాప్తంగా అన్ని అడవుల్లోనూ డిసెంబరులో జరిగే పులుల గణన కార్యక్రమం శేషాచలం లోనూ ఈసారి జరగనుంది. నాలుగేళ్లకు ఒకసారి మాత్రమే పులుల సంఖ్యను లెక్కిస్తారు. నల్లమల అడవులను మాత్రమే ఆవాసంగా చేసుకున్న పెద్దపులి జాడ శేషాచలం సమీపంలో కొన్నేళ్లుగా కనిపించడమే ఇందుకు కారణం. 2017లో చామల రేంజ్ (నల్లమల అటవీప్రాంతం)లో ఒక మగపులి కనిపించింది. నాగార్జునసాగర్ రిజర్వ్ నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు సమీపంలోని నల్లమల, శేషాచలం కొండల మధ్య ఉన్న టైగర్‌కారిడార్‌లోకి పెద్దపులి ప్రవేశించిందని అప్పుడు గుర్తించారు. అలాగే ఈ ఏడాది ఆగస్టు నెలలో శేషాచల అడవులకు ఆనుకుని ఉన్న అన్నమయ్య జిల్లాలోని చిట్వేలి అడవుల్లోకూడా పెద్దపులి కనిపించింది. ఇక్కడ ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో పగటిపూట, సాయంత్రం సమయాల్లో పులి తిరుగుతున్నట్టు రికార్డు అయింది. దాదాపు వందేళ్ల తరువాత ఈ ప్రాంతంలో పెద్దపులి కనిపించడం విశేషం. నల్లమల నుంచి వచ్చిన పెద్దపులులు శేషాచలంలో ఎన్ని ఉన్నాయో ఈ లెక్కింపు ప్రక్రియలో తేలనుంది.

300 ట్రాప్ కెమెరాలు

తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో పులుల గణన కోసం 300 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. రేంజ్ విస్తీర్ణం బట్టి 20 నుంచి 30 కెమెరాలు పెడుతారు.ఇక్కడ 15మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తారు. ట్రాప్ కెమెరాల ద్వారా పెద్దపులితో పాటూ ఇతర జంతువుల లెక్కింపు కూడా జరుగుతుంది.

పులులు ఎలా లెక్కిస్తారంటే..

ట్రాప్ కెమెరాలు — అడవిలోని వివిధప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేస్తారు. పులులు కదలిక కనిపించినపుడు కెమెరాలు గుర్తించి ఫోటోలు తీస్తాయి.

పాదముద్రలు — అడవుల్లో పులుల పాదముద్రల కోసం అన్వేషిస్తారు. వాటిని గుర్తించడం ద్వారా పులి పరిమాణం, ఆకారం , వయసు అంచనా వేస్తారు.

వెంట్రుకలు, గోళ్లు — పులులు తిరిగిన ప్రదేశాల్లోనూ, ఆవాసంగా చేసుకున్న తావుల్లోనూ వెంట్రుకలు, గోళ్లు సేకరిస్తారు. వీటిని డీఎన్ఏ పరీక్షలు కోసం పంపుతారు.ఈ నమూనాల ద్వారా పులుల సమగ్ర సమాచారం నిర్ధారిస్తారు.

భూభాగ విశ్లేషణ — పులులు నివసించే ప్రాంతాలను ముందుగా గుర్తిస్తారు. ఆ ప్రాంతాల్లోని ఇతర జంతువుల సంఖ్యను అంచనా వేస్తారు. పులికి ఆహారంగా ఉండే జంతువుల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతానే పులి ఆవాసంగా ఎంచుకుంటుంది.

ముక్కంటికి బహుమానం



విజయనగర రాజ్య చిహ్నం వరాహం చిత్రంగల రాజముద్ర

శ్రీకాళహస్తిలో బయటపడ్డ అరుదైన విజయనగర కాలంనాటి రాగిపలకల శాసనాలు



రాగిరేకులమీద ఉన్న శాసనాలు

● పలు గ్రామాలు

శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

విజయనగరరాజు శ్రీరంగరాయ శ్రీకాళహస్తీశ్వరాలయంలో కైంకర్యాలు, అన్నదానాలు నిర్వహించడం కోసం నాడుకాడు, కంపిలి, అందలమాల, ఉప్పటేరు, దుగ్గరాజపట్టణం, పిలిగుంచలపోతు, చీమలపాడు, తిరుమూరు గ్రామాలను బహుమానంగా ఆలయానికి ఇస్తున్నట్లు లిఖించిన శాసనాలు బయటపడ్డాయి. ఆలయంలో అనువంశిక గురుకుల్‌గా సేవలందిస్తున్న డాక్టర్ పరశురామ్ ఇంట అవి పదిలంగా తరాలుగా ఉన్నాయి. శక. 1498, ధాత్రి, కార్తీక సు. 12న అనగా 1576 నవంబరు 3 శనివారం రోజున ఈగ్రామాలను దానంగా ఇచ్చినట్లు ఇందులో ఉంది. చంద్రగిరి రాజ్యంలోని పడనాడు సీమకు చెందిన బ్రాహ్మణుడు యాదాటి నరసింహభూపాల మనుమడు, తిమ్మావధాని కుమారుడు అయిన శ్రీలక్ష్మీపతి భట్టకు వీటిని దానంగా ఇచ్చినట్టు లిఖించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నైవేద్య కైంకర్యాలకు, పునరుద్ధరణ పనులకు వినియోగించాలని పేర్కొన్నారు. తిరుమూరుకు వెంగలాంబపురం అని పేరు మార్చిన అంశం కూడా ఇందులో ఉంది.



పరశురామ్ గురుకుల్

వెలుగులోకి వచ్చింది ఇలా...

శ్రీకాళహస్తీశ్వరాలయ రాజగోపురానికి ఆనుకుని ఉన్న తేరువీధిలో అనువంశిక దండాధికారి డాక్టర్ పరశురామ్ గురుకుల్ నివాసం ఉంది. వీరి వంశీయులు తరతరాలుగా పరంపరాగతంగా ఆలయంలో వైదిక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. తాత పేరుతోనే నామకరణం జరుపుకున్న పరశురామ్ గురుకుల్ చెన్నైలో ఎంబీబీఎస్ పూర్తి చేసి కొంతకాలం స్విమ్స్‌లో డాక్టర్‌గా చేశారు. చదువుతోపాటు వేదం, ఆగమ, శిల్ప శాస్త్రాలను అధ్యయనం చేశారు. వైద్యవృత్తికన్నా అనువంశికంగా చేస్తున్న వైదిక క్రతువుల నిర్వహణనే ఎంచుకున్న ఆయన ప్రస్తుతం ఆలయంలో దండాధికారిగా ఉన్నారు. తీరిక వేళల్లో ఇంటి వద్ద వైద్యసేవలు కొనసాగిస్తున్నారు. తమ ఇంట మంత్రబంధనంగాఉన్న పురాతన రాగిఫలకలను అపడుడపుడు తెరచేవారు. ఇటీవల కార్తీక మాసం కావడంతో వీటిని శుద్ధి చేశారు. డాక్టర్‌పరశురామ్ గురుకుల కుటుంబానికి పురోహితులుగా వ్యవహరిస్తున్న సింగరాజు మణి ఆ రాగిఫలకల మీద ఉన్న అక్షరాలను చూసి ఆసక్తితో వాటిని ఫోటోలు తీసి ఎపిగ్రఫీ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపడంతో ఇవి విలువైన చారిత్రక ఆధారాలనే సంగతి వెల్లడైంది. రెండు జతల శాసనాలు వీరి వద్ద ఉన్నాయి. ఇవి రాజముద్రతో కూర్చి ఉన్నాయి. రెండింటిలో కలిపి మొత్తం ఐదు రాగిపలకలు ఒక గుత్తిగా ఉన్నాయి.. ఇందులో ఒక దానిపై శ్రీరామ శాసనం...మరొకదానిపై విరూపాక్ష శాసనం అని ఉంది.

మీ సొమ్ము మీకే

● బ్యాంకులో మురుగుతున్న రూ.86.31కోట్లు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాలో నగదు వేసి లావాదేవీలు జరపకుండా వదిలేయడం.. ఖాతాదారులు మృతిచెందడం.. చిరునామా మార్చుకున్న వంటి కారణాలతో జిల్లాలో రూ.86.31కోట్లు బ్యాంకు ఖాతాల్లో మురుగుతున్నాయి. 5,14,468 ఖాతాల్లో రూ.86.31కోట్లు క్లెయిం చేయని నగదు ఉంది. వీటిలో వ్యక్తిగత ఖాతాల్లో రూ.60.20కోట్లు, వివిధ సంస్థలకు చెందవిన 30,400 ఖాతాల్లో రూ.20.83కోట్లు, ఇక ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 5,764 ఖాతాల్లో రూ.5.28కోట్లు ఉన్నట్లు జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజరు రవికుమార్ తెలిపారు. పదేళ్లపైగా లావాదేవీల్లేని ఖాతాలోని సొమ్మును ఇచ్చే ప్రక్రియను ఆర్‌బీఐ ప్రారంభించింది. కాబట్టి ఖాతాదారులు లేదా వారి నామినీలు సంబంధిత బ్యాంకుఖాతాను సంప్రదించి సరైన ధ్రువపత్రాలు సమర్పించి, ఈకేవైసీ పూర్తిచేయడం ద్వారా ఆ నగదు తిరిగి పొందవచ్చని లీడ్ బ్యాంకు మేనేజరు తెలిపారు.

వేడుకగా గృహ ప్రవేశాలు

● నిర్మాణం పూర్తయిన 14,486 పక్కా ఇళ్లు



పుత్తూరులో లబ్ధిదారులకు తాళం చెవి అందిస్తున్న ఎమ్మెల్యే భాను

తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రభుత్వ పక్కా ఇళ్లకు బుధవారం ఘనంగా గృహ ప్రవేశాలు జరిగాయి. ఎనిమిది నియోజవర్గాల పరిధిలో గతేడాది జూన్ నుంచీ ఇప్పటి దాకా పీఎంఏవై 1.0 పథకం కింద బీఎల్‌సీ, గ్రామీణ్ కేటగిరీలలో 14,486 పక్కా ఇళ్ళ నిర్మాణం పూర్తయ్యాయి. వీటిలో లే అవుట్లకు సంబంధించి 9984 ఇళ్లుండగా లబ్ధిదారుల సొంత స్థలాల్లో 4502 ఇళ్లున్నాయి. పూర్తయిన ఇళ్ళకు జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా చంద్రగిరిలో 1020, గూడూరులో 1564, నగరిలో 469, సత్యవేడులో 781, శ్రీకాళహస్తిలో 2232, సూళ్ళూరుపేటలో 1487, తిరుపతిలో 6047, వెంకటగిరిలో 886 చొప్పున ఇళ్ల నిర్మాణం పూర్తయింది. బుధవారం జరిగిన గృహప్రవేశ కార్యక్రమాల్లో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, పుత్తూరులో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, సత్యవేడులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణరెడ్డి, సూళ్ళూరుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొని లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేశారు. ఆయా చోట్ల స్థానిక హౌసింగ్ అధికారులు, ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. చంద్రగిరికి సంబంధించి ఎమ్మెల్యే పులివర్తి నానీ అందుబాటులో లేకపోవడంతో ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.20కోట్లు

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.2,20,13,724 వచ్చింది. ఆలయంలోని కొట్టు మండపం వద్ద లెక్కింపు చేపట్టారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను లెక్కించారు. బంగారం 59.100 గ్రాములు, వెండి 599 కిలోలు, విదేశీ కరెన్సీ 132 వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది



పుత్తూరులో వైసీపీ శ్రేణుల ర్యాలీ

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వద్దు

● వైసీపీ శ్రేణుల ఆందోళన

తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించవద్దంటూ బుధవారం జిల్లావ్యాప్తంగా వైసీపీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. తిరుపతిలో భూమన అభినయ్, వెంకటగిరిలో నేదురుమల్లి రాంకుమార్, గూడూరులో ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్, సూళ్లూరుపేటలో కిలివేటి సంజీవయ్య, సత్యవేడులో రాజేశ్, శ్రీకాళహస్తిలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నేతలు, శ్రేణులు ర్యాలీగా వెళ్లి ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో వినతపత్రాలిచ్చారు. చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుచానూరులో ర్యాలీగా వెళ్లి పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రమిచ్చారు. ఇక, పుత్తూరులో మాజీ మంత్రి రోజా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ వర్గాలు ర్యాలీగా వెళ్లి తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు.

రీ గ్రూపింగ్‌తో గందరగోళం

● ఆంధ్రజ్యోతి పరిశీలన



చిల్లకూరు ఒకటో సచివాలయంలో పనులకోసం వచ్చిన గ్రామస్థులు

● సచివాలయాల్లో పెద్దగా కనిపించని ఉద్యోగులు
● సర్వేలు, ఫీల్డువర్కు పేరిట ఎక్కువ సమయం బయటే

తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రీ గ్రూపింగ్‌తో సచివాలయ నిర్వహణ కొంత గందరగోళంగా మారింది. రీ గ్రూపింగ్‌తో క్లస్టర్ వ్యవస్థ ఏర్పాటు కావడంతో సిబ్బందిని ఆ క్లస్టర్ పరిధిలోని సచివాలయాల్లో సర్దుబాటు చేశారు. దీంతో కొందరు రెండు సచివాలయాల్లో పనిచేయాల్సి ఉంది. మరికొందరు డెప్యుటేషన్ తరహాలో మరో సచివాలయంలోనూ పని చేస్తున్నారు. వీఆర్వో, సర్వేయరు సచివాలయాల్లోనూ, తహసీల్దారు కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉండాలి. క్షేత్రస్థాయి విధులకూ హాజరు కావాలి. దీంతో వీరు ప్రజలకు అందుబాటులోకి రావడం కష్టంగా మారింది. పంచాయతీ, అడ్మిన్ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే సచివాలయాల్లో అందుబాటులో ఉంటుండగా మిగిలిన వారు ఫీల్డు వర్కు పేరిట అధిక సమయం బయటే ఉంటున్నారు.



రెండు రోజుల కిందట బాలాయపల్లి మండలం పిగిలాం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ఒక్కరే

కొందరిపైనే పని ఒత్తిడి

● పంచాయతీ లేదా అడ్మిన్ కార్యదర్శి, డిజిటల్.. ఎనర్జీ.. వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం వంటి సిబ్బందికి పని ఒత్తిడి అధికంగా ఉంది.
● వీఆర్వో, సర్వేయర్లలో సిన్సియర్‌గా పనిచేసే వారిపై ఒత్తిడితో ఉండగా,మిగిలిన వారు అక్కడున్నాం..ఇక్కడున్నామంటూ కాలం గడిపేస్తున్నారు.
● అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, ఫిషరీస్, వెటర్నరీ అసిస్టెంట్లకు ఆయా సీజన్లలో ఇ-క్రాప్ నమోదు, ఎరువులు-విత్తనాల పంపిణీ వంటి పనులున్నాయి. ఆ తర్వాత పని తక్కువే.
● హౌసింగ్ స్కీమ్‌లు ప్రారంభం కాకపోవడంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పెద్దగా పని లేదు.
● మహిళా కార్యదర్శికి పని ఉండడం లేదనే చెప్పాలి. వీరిపై కొత్త విధానంలో తగిన పర్యవేక్షణ లేదు.

సచివాలయాలు ఎలా ఉన్నాయంటే..

జిల్లాలోని కొన్ని సచివాలయాలను సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు పరిశీలించారు.
● డక్కిలి మండలం పలుగోడు సచివాలయంలో డిజిటల్.. అగ్రికల్చర్ అసిస్టెంట్ మినహా మిగిలిన కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి.
● డక్కిలి మండలం చావలపల్లి సచివాలయం ఉదయం 10.20 గంటలకు కూడా తాళాలు తీయలేదు.
● వెంకటగిరి పట్టణం 14, 15 వార్డులకు సంబంధించిన సచివాలయానికి 10.23 గంటలకు కూడా తాళాలు తీయలేదు. అర్జీదారులు తలుపు ముంగిట మెట్లపై నిరీక్షిస్తూ ఉన్నారు. ● బాలాయపల్లి మండలం పిగిలాం సచివాలయంలో కొందరు సెలవులో, ఇంకొందరు ఫీల్డుకు వెళ్లగా డిజిటల్ అసిస్టెంట్ ఒక్కరే కనిపించారు.
● చిల్లకూరులోని ఒకటో సచివాలయంలో సిబ్బంది అందరూ హాజరుకాగా అర్జీదారులతో కార్యాలయం సందడిగా కనిపించింది.



రిజిస్టర్లలో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

'కోగిలి' సమస్యలు తీర్చేదెవరు?

చిట్టమూరు మండలం కోగిలి మేజర్ పంచాయతీ ప్రజల సమస్యలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన సచివాలయమే సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఊరికి కిలోమీటరు దూరంలో చెరువు కలుజు వద్ద దీని భవనం నిర్మించారు. గ్రామస్తులు వ్యతిరేకించినా అప్పటి అధికార పార్టీ అయిన వైసీపీ నేతలు ఖాతరు చేయలేదు. భవనం కట్టి ఆరేళ్లయినా విద్యుత్ సౌకర్యం, నీటి సరఫరా లేదు. విద్యుత్ సర్వీసు లేనందున ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. కంప్యూటర్లకు బదులు రిజిస్టర్లలో వివరాలు నమోదు చేస్తున్నారు. ఆన్‌లైన్ సేవల్లేక గ్రామస్తులూ ఇబ్బంది పడుతున్నారు.

సచివాలయ వ్యవస్థ

పంచాయతీలు: 774
సచివాలయాలు: 691 (వార్డు 196, గ్రామ సచివాలయాలు 495), **సిబ్బంది:** 5303 (వార్డు 1743, గ్రామ సచివాలయాల్లో 3560)

రీగ్రూపింగ్ తర్వాత

సచివాలయాలు: 353 క్లస్టర్లు,
మిగులు సిబ్బంది: 775
(వార్డు 297, గ్రామ సచివాలయాల్లో 478)
● మొదట్లో సచివాలయానికి 12 మంది చొప్పున సిబ్బంది ఉండగా రీ గ్రూపింగ్ తర్వాత ఆ సంఖ్యను కనిష్ఠంగా 6 నుంచి గరిష్ఠంగా 8కి కుదించారు.

ఎస్వీబీసీకి ప్రత్యేకంగా అకౌంట్ ఆఫీసర్

● టీటీడీ ఈవో సింఘాల్

తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీబీసీ(శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్)లో ఆర్థిక అంశాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రభుత్వం నుంచి లేదా, అటానమస్ సంస్థ నుంచి ప్రత్యేకంగా అకౌంట్స్ ఆఫీసర్‌ను నియమించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో బుధవారం ఎస్వీబీసీ బోర్డు మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, ఎస్వీబీసీ ద్వారా మరింత నాణ్యమైన ప్రసారాలు అందించేందుకు చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ సమీక్షలో ఎస్వీబీసీ ఇంచార్జీ సీఈవో ఫణికుమార్ నాయుడు, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ పాల్గొన్నారు.


శంకర్‌రెడ్డికి గన్‌మెన్ కేటాయింపు

సత్యవేడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డికి ప్రభుత్వం భద్రతను పెంచింది. శంకర్‌రెడ్డికి వన్ ప్లస్ వన్ గన్‌మన్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నియోజకవర్గంలో చురుకుగా తిరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్న శంకర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఓ వర్గం గందరగోళ పరిస్థితులను సృష్టించే ప్రయత్నం చేస్తోందని ప్రభుత్వానికి సమాచారం అందడంతో భద్రత కారణాల దృష్ట్యా వన్ ప్లస్ వన్ గన్‌మన్ ఏర్పాటు చేసింది.

'కిష్కింధపురి' విజయంతో కొండకు వచ్చా!

● హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్

తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన 'కిష్కింధపురి' సినిమా విజయవంతం అయిన సందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామికి, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, తన తదుపరి చిత్రం 'హైందవ'ను కూడా ఇదే స్థాయిలో ఆదరించి విజయాన్ని ఇవ్వాలని కోరుకున్నానన్నారు.




సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 25 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.30 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,367

తలనీలాలు సమర్పించినవారు: 22,369





సిట్ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న ధర్మారెడ్డి

అటు కల్తీ నెయ్యి.. ఇటు పరకామణి

తిరుపతిలో ముమ్మరంగా టీటీడీ కేసుల విచారణ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీటీడీకి సంబంధించి కల్తీ నెయ్యి, పరకామణిలో చోరీ కేసులకు సంబంధించి తిరుపతిలో ముమ్మరంగా విచారణ జరుగుతోంది. ఒకవైపు సీఐడీ.. మరోవైపు సీబీఐ భాగస్వామ్యమున్న సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోంది.

● తిరుపతిలోని టీటీడీ భూదేవి కాంప్లెక్సులో సీబీఐ డీఐజీ మురళీ రాంబా నేతృత్వంలోని సీబీఐ డీఎస్పీలు, సిట్ దర్యాప్తు అధికారి వెంకట్రావు ఇతర పోలీసు అధికారులు కల్తీ నెయ్యి కేసులో బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిలిజైన్, విపిన్‌జైన్‌తో పాటు టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని మంగళ, బుధవారాల్లో విచారించారు. దీంతో ఇక్కడ కూడా హడావుడి నెలకొంది.

● మరోవైపు శ్రీ పద్మావతి అతిథి గృహం కేంద్రంగా వారం రోజులుగా పరకామణిలో జరిగిన చోరీ కేసును హైకోర్టు ఆదేశాల మేరకు ఏకంగా సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసులో నిందితుడు రవికుమార్, అతడి కుటుంబ సభ్యులను తొలుత విచారించారు. ఆ తర్వాత ఈ కేసు సమయంలో తిరుమలలో వన్‌టౌన్ సీఐగా పనిచేసిన జగన్మోహన్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మీరెడ్డి, అప్పటి టూ టౌన్ సీఐ చంద్రశేఖర్, పరకామణి డిప్యూటీ ఈవో మల్లికార్జునరావు, టీటీడీ సెక్యూరిటీ అధికారులు సుబ్బరాజు, రామచంద్ర, సీసీ కమాండ్ యూనిట్ గార్డు చంద్రతో పాటు జయచంద్రారెడ్డిని విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. దీంతో అధికారుల రాకపోకలు, విచారణ కోసం వస్తున్న వారితో పద్మావతి అతిథి గృహం సందడిగా మారింది.

● ఇంకోవైపు పరకామణి చోరీ కేసులో నిందితుడైన రవికుమార్.. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఏసీబీ విచారిస్తోంది. ఈ కేసు కూడా తిరుపతి కేంద్రంగా నడుస్తోంది. జరుగుతుంది.

◆ 'పరకామణి' కేసులో

టీడీపీ జోక్యం ఉండదు

● నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయండి ● సీఐడీ డీజీని కోరిన వర్ల రామయ్య

తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీ కేసుపై సీఐడీ జరుపుతున్న దర్యాప్తులో టీడీపీ జోక్యం ఉండదని, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలంటూ ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌ను కోరారు. బుధవారం సాయంత్రం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహం కాన్ఫరెన్సు హాలులో ఆయన టీడీపీ నేతలతోపాటు సీఐడీ చీఫ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీవారి పరకామణిలో ఎన్ని వందల కోట్లు కొట్టేశారో తెలియాల్సి వుందన్నారు. ఈ కేసును నెలలోనే లోక్ అదాలత్‌లో రాజీ చేయడం వెనుక ఎవరున్నదీ ప్రజలకు తెలియాల్సి వుందన్నారు. హైకోర్టు ఇచ్చిన సమయం చాలకపోతే ఇంకా వ్యవధి తీసుకుని వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. టీటీడీకి ఆస్తులను బదిలీ చేసిన సమయంలో స్టాంప్ డ్యూటీ ఎవరు చెల్లించారో తేల్చాలన్నారు. దీని వెనుక ఎంత పెద్దవారున్నా వదలిపెట్టవద్దని కోరారు. నిక్కచ్చిగా, నిర్భయంగా విచారణ చేయాలని అభ్యర్థించారు. పరకామణి చోరీ కేసు రాజీకి కర్త, కర్మ, క్రియ అంతా భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, ధనంజయరెడ్డిలేనని ఆరోపించారు. వారి కుటుంబీకులు, బంధువుల ఆస్తులు వెలికి తీయాలని, పరకామణి చోరీ నిధులతో ఆస్తులు ఎక్కడెక్కడ కొనుగోలు చేశారో నిగ్గు తేల్చాలని కోరారు. దర్యాప్తులో తేల్చాల్సిన పలు సందేహాలకు సంబంధించి 27 అంశాలతో వినతి పత్రం ఇచ్చారు. ఆయన వెంట ఆయన వెంట తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, ఏపీ జీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ గురజాల మాల్యాద్రి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నేతలు శ్రీధర్ వర్మ, కుమారమ్మ, మహేష్ యాదవ్, సూరా సుధాకరరెడ్డి, రజనీకాంత్ నాయుడు, పాలకం వెంకటేష్, వట్టికుంట శంకర్ తదితరులున్నారు.



సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌తో మాట్లాడుతున్న వర్ల రామయ్య

హైకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య నుంచీ వినతి పత్రాన్ని తీసుకున్న సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్.. ఆ పత్రాన్ని హైకోర్టుకు అందజేస్తామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తామన్నారు. లోతుగా విచారించి నిందితులకు శిక్ష పడేలా చూస్తామన్నారు. దేవుడి ఆస్తికి సంబంధించిన కేసు కాబట్టి నిర్భయంగా దర్యాప్తు చేస్తామని, దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

పళ్లికొండేశ్వరాలయ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

● చైర్మన్ పద్మనాభరాజు

నాగలాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానం సర్వతో ముఖాభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పద్మనాభరాజు చెప్పారు. బుధవారం ఆలయ సమావేశ మందిరంలో పాలక మండలి మొట్టమొదటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. దేవస్థానంలో ఉన్న గోశాలలో 56 గోవుల సంరక్షణకు ఇద్దరు కార్మికులు సరిపోకపోవడంతో మరో కార్మికుడిని నియమించుకోవాలని తీర్మానించారు. నిత్యం స్వామిఅమ్మవార్ల అభిషేకాలు ప్రారంభయ్యే సమయానికి గోపూజ నిర్వహించాలని, నైవేద్యం భక్తులందరికీ అందేలా దిట్టం పెంచాలని తీర్మానించారు. మరో ఇద్దరు అర్చకులను, అటెండరు నియామకానికి దేవదాయ శాఖ ఆమోదానికి పంపాలని ఈవో లతను కోరారు. కారిడార్ మరమ్మతులు పూర్తి చేసి భక్తుల బసకు ఏర్పాటు చేస్తామన్నారు. దాతల సహకారంతో మరో 8 వసతి గృహాలు నెల రోజుల్లో పూర్తి చేస్తున్నామన్నారు. 2026 ఫిబ్రవరిలో జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లపై ముందస్తు చర్చలు వేశారు. ఉభయదారులకు ఉభయపైకం రూ.35 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని తీర్మానించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కృష్ణయ్య, వెల్సన్ మండేలా హంస, దేవి, జయంతి, కవిత, నాగభూషణమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నూతన పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

లారీ ఢీకొని ఇద్దరి మృతి



రంజిత్ నాయుడు, బాబురాజు

వడమాలపేట,నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై జాతీయ రహదారి తడుకు ఆర్.ఎస్. వద్ద ఇద్దరు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మృతి చెందారు. విజయపురం మండలం కేవీపురానికి చెందిన రంజిత్ నాయుడు(52), ఎస్‌బీఆర్‌పురానికి చెందిన బాబురాజు అలియాస్ నరసింహరాజు (51) రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి పుత్తూరు వైపుగా వెళ్తున్న లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వడమాలపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

విశాఖకు మరో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు

- బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు -

తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో మరో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులతో 50 దేశాలకు చెందిన సంస్థలు విశాఖపట్నంలో కంపెనీలు పెట్టే అవకాశం ఉందని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికే దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులతో అనేక సంస్థలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. కాగా ఢిల్లీ బాంబ్ బ్లాస్ట్ నేరస్తులను శిక్షించే శక్తిని ప్రధాని మోదీ, అమిత్ షాలకు ప్రసాదించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు. ఇలా ఉండగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కూడా బుధవారం స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

నేటి నుంచి 'నృత్య వాహిని'



వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం నుంచి 'నృత్య వాహిని' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీసీ ఉమ తెలిపారు. బుధవారం ఆమె రిజిస్ట్రార్ రజని, కన్వీనర్లు వాణి, విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ హిమబిందుతో కలిసి మీడియాతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటలకు ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభిస్తారన్నారు. మైసూరు వర్సిటీ ప్రొఫెసర్ శీల శ్రీధర్ కీలకోపన్యాసం చేస్తారన్నారు. 15వ తేదీ దాకా సాగే ఈ కార్యక్రమంలో 87 మంది దేశ, విదేశీ నృత్యకారులు అనేక నృత్య రీతులను ప్రదర్శిస్తారని చెప్పారు. వివిధ నృత్యాలపై మ్యూజిక్ అండ్ డ్యాన్స్ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ హిమబిందు నేతృత్వంలో వర్క్‌షాప్ చేపడుతున్నామని తెలిపారు. సమాపనోత్సవం సందర్భంగా కళాకారులందరూ సామూహిక నృత్య ప్రదర్శన చేస్తారన్నారు.

పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌లో ఫార్మసీ డిప్లొమా కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌లో ఫార్మసీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి 19వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఇందుకోసం 18వ తేదీ దాకా దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ ఉత్తీర్ణత పొందిన విద్యార్థినులు విద్యార్హత సర్టిఫికెట్ల ఒరిజినల్, మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో నేరుగా హాజరుకావాల్సి ఉంటుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తారు. ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజుతో విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తారు. సమగ్ర సమాచారం కోసం.. 92990 08151 నెంబరులో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు.

ఆలయంలోకి సరుకులు చేర్చేందుకు కొత్త 'బ్యాగ్ కన్వేయర్'

తిరుమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలోకి ముడి సరుకులు చేర్చేందుకు నూతన బ్యాగ్ కన్వేయర్ (బ్యాగ్ స్టాగర్) అందుబాటులోకి వచ్చింది. సాధారణంగా శ్రీవారికి సమర్పించే అన్నప్రసాదాలు, లడ్డూలు, వడలు, ఇతర ప్రసాదాలన్నీ సంప్రదాయం మేరకు శ్రీవారి ఆలయంలోని పోటు (కట్టెల పొయ్యితో కూడిన వంటశాల)లోనే తయారవుతాయి. ఈమేరకు నిత్యం దాదాపు 50 టన్నుల నుంచి 65 టన్నుల ముడిసరుకులను ఆలయంలోకి పంపాల్సి ఉంటుంది. మహాద్వారం నుంచి ఈ సరుకులను తరలించడం అంటే భక్తులకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఈక్రమంలో 35 ఏళ్లుగా ఆలయం వెనుకభాగంలో ఉన్న ఉగ్రాణం (ముడిసరుకుల నిల్వ ప్రదేశం) నుంచి టీటీడీ బ్యాగ్ కన్వేయర్ ద్వారా సరుకులను ఆలయంలోకి పంపుతున్నారు. అప్పట్లో చెన్నైకి చెందిన ఓ సంస్థ ఈ బ్యాగ్ కన్వేయర్‌ను విరాళంగా అందించింది. ప్రసాదాల తయారీకి కావాల్సిన సరుకులను చిన్నపాటి మూటలు కట్టి ఈ కన్వేయర్‌పై ఉంచితే దాదాపు 40 అడుగల ఎత్తులో ఉన్న ఆలయ ప్రాకారంపైకి చేరుతాయి. అక్కడి సిబ్బంది ఈ సరుకులను తీసుకుని ప్రసాదాల తయారీకి వినియోగిస్తారు. ఇది ప్రతిరోజు జరిగే ప్రక్రియ. అయితే దాదాపు 35 ఏళ్ల క్రితం నుంచి వినియోగిస్తున్న ఈ బ్యాగ్ కన్వేయర్ నిత్యం మరమ్మతులకు గురవుతోంది. అప్పటికప్పుడు మరమ్మతులు పూర్తిచేసి సిద్ధం చేసినప్పటికీ బ్యాగ్ కన్వేయర్ బాడీ పూర్తిగా దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. కన్వేయర్ కింద నిత్యం భక్తులు కూడా రాకపోకలు సాగిస్తున్న క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకూడదనే ముందస్తు జాగ్రత్తగా టీటీడీ నూతన బ్యాగ్ కన్వేయర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఓ దాత సహకారంతో నాగ్‌పూర్ నుంచి నూతన బ్యాగ్ కన్వేయర్‌ను తిరుమలకు తీసుకువచ్చారు. ప్రస్తుతం ఇందులోనే హైడ్రాలిక్, బాడీ వంటి వాటిని పరిశీలన చేస్తున్నారు. రానున్న రెండుమూడు రోజుల్లో దీన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నారు.



ప్రస్తుతం వినియోగంలో ఉన్న బ్యాగ్ కన్వేయర్ - నూతన బ్యాగ్ కన్వేయర్

'వికసిత్ భారత్' లక్ష్యంగా పనిచేయండి

● మహిళా మోర్చాను బలోపేతం చేయండి

● కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పిలుపు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'వికసిత్ భారత్' లక్ష్యంగా పనిచేయాలని, మహిళా మోర్చాను బలోపేతం చేయాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన నిషిధారాజు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులైన సందర్భంగా బుధవారం నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో ఆయన వీరు పాల్గొన్నారు. ఉత్పత్తి రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచిన మేకిన్ ఇండియా నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి సూచించారు. ఆత్మనిర్భర భారత్ లక్ష్యంగా పనిచేస్తే ప్రపంచంలో మూడవ ఆర్థిక శక్తిగా ఉన్న దేశాన్ని అగ్రస్థానంలోకి తీసుకెళ్లొచ్చని, దీనికి ప్రజలు, పార్టీ శ్రేణులు కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు. నిషిధారాజు ఆధ్వర్యంలో మహిళామోర్చా మరింత బలోపేతమౌతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలను పెద్ద సంఖ్యలో గెలిపించుకోవాల్సిన అవసరం కూటమిపై ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకు నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తోందని ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోమువీర్రాజు తెలిపారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.నిషిధారాజును ఘనంగా సత్కరించి అభినందించారు. బీజేపీ నేతలు విష్ణుకుమార్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, సామంచి శ్రీనివాస్, నాగలక్ష్మి, మాధవి, పార్వతి, యువశ్రీ, విజయలక్ష్మి, ఇతర నేతలు, శ్రేణులు పాల్గొన్నారు.



చట్టాలను రూపకల్పన చేసిన దార్శనికుడు మోదీ

● లా విద్యార్థులతో కేంద్ర మంత్రి

కాలం చెల్లిన బ్రిటిష్ కాలం నాటి చట్టాలను మార్చి భారతీయ న్యాయ చట్టాలకు రూపకల్పన చేసిన దార్శనికుడు ప్రధాని నరేంద్రమోదీ అని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. అంబేడ్కర్ గ్లోబల్ లా కళాశాలలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన 'స్వశక్త భారత్ - ఆత్మనిర్భర్ భారత్' సదస్సులో ఆయన న్యాయ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ న్యాయ చట్టాలను తీసుకురావడం సాధారణ విషయం కాదన్నారు. న్యాయ విద్యార్థులందరూ వీటిపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. స్థానిక ఉత్పత్తులను మన జీవితంలో భాగం చేసుకుని దేశాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పీవీఎన్ మాధవ్ కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయ విద్యార్థులతో పాటు బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఉదయం తిరుపతిలో 'మన ఊరు- మన జెండా' కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగరం పళణి థియేటర్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాధవ్ జెండా ఆవిష్కరించారు. పార్టీలో చేరిన యువకులకు కండువా కప్పారు.



డైకిన్ పరిశ్రమలో జాగృతి యాత్ర బృందం

శ్రీసిటీలో జాగృతి యాత్ర బృందం

శ్రీసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాగృతి యాత్ర బృందానికి చెందిన 525 మంది సభ్యులు గురువారం బుధవారం సాయంత్రం శ్రీసిటీని సందర్శించారు. ఔత్సాహక పారిశ్రామికవేత్తలను తయారు చేసే లక్ష్యంతో ముంబైకి చెందిన జాగృతి సేవా సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ఏటా చేపట్టే ఈ జాగృతి యాత్ర, ప్రత్యేక రైలు ప్రయాణం ద్వారా దేశమంతా 8 వేల కి.మీ పర్యటిస్తుంది. వివిధ రంగాల్లో ఆదర్శవంతులను(రోల్ మోడల్) కలుసుకుని వారితో సంభాషించడం ద్వారా యాత్రికుల్లో స్ఫూర్తి నింపుతుంది. శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి యాత్ర బృందానికి సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక కేంద్రం ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. పర్యటనలో భాగంగా యాత్రికులు శ్రీసిటీ పరిసరాలు, పారిశ్రామిక పురోగతిని నేరుగా వీక్షించడంతో పాటు పలు బ్యాచ్‌లుగా విడిపోయి డైకిన్, బ్లూస్టార్, లావాజ్జా ఈ ప్యాక్, పెప్సికో, అంబర్ రాక్‌వర్త్, బెర్గెన్ పైపు సపోర్ట్స్, ఏఎల్ఎఫ్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, ఎంఎండీ, బ్రేక్స్ ఇండియా, డైకి అల్యూమినియం పరిశ్రమలను సందర్శించారు. శ్రీసిటీ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, వ్యాపారానుకూల వాతావరణం, సుస్థిర పర్యావరణ వ్యవస్థ, ఉపాధి, వివిధ రకాల ఉత్పత్తుల వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. తమ బృందానికి సందర్శన అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి జాగృతి సంస్థ సీఈవో అశుతోష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెట్టుబడులు, ఔత్సాహక పారిశ్రామికవేత్తలకు అపార అవకాశాలు ఉన్న సంపూర్ణ వ్యాపార నగరానికి శ్రీసిటీ ఒక చక్కటి ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. 2016 నుంచి నేటి వరకు 8 పర్యాయాలు తమ బృందం శ్రీసిటీని సందర్శించిందని, ప్రతిసారి సభ్యులతో శ్రీసిటీ చెరగని ముద్ర వేసిందని వ్యాఖ్యానించారు. పరిశ్రమల సందర్శన అనంతరం బుధవారం రాత్రి వారి రోల్ మోడల్‌గా ఎంచుకున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి జాగృతి సభ్యులతో సమావేశమవుతారు. ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా శ్రీసిటీ ప్రయాణం, దార్శనికత, సవాళ్లు, మైలు రాళ్లను వివరిస్తూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేస్తారు.

నేటి నుంచి పంచగవ్య వైద్య మహా సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌వర్మ

తిరుపతి(ఎంఆర్ పల్లె), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు పంచగవ్య వైద్య మహాసమ్మేళనం జరగనున్నట్లు సిద్ధాచార్య నిరంజన్‌వర్మ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. దేశ నలుమూలల నుంచి పంచగవ్య వైద్యశాస్త్రంపై పనిచేస్తునన శాస్త్రవేత్తలు, గవ్య ఉత్పత్తి నిర్వాహకులు, గోశాల నిర్వాహకులు, గోరక్షకులు సుమారు 1,200మంది ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. కొత్త కొత్త విషయాలపై తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తారన్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. పంచగవ్య వైద్యశాస్త్ర విద్యను పూర్తిచేసిన 201మందికి అడ్వాన్స్ డిప్లొమా ఇన్ పంచగవ్య థెరపి సర్టిఫికెట్ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ గురుస్వామి, ఝాన్సీ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎన్ బ్రాండ్‌తో పరిశ్రమల వెల్లువ: నెలవల



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, నవంబరు, 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజనరీ బ్రాండ్‌తో ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం నాయుడుపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తీసుకొచ్చి పెట్టుబడులను ఆకర్షిస్తున్నారన్నారు. సీఎంతో పాటు మంత్రి లోకేశ్ వివిధ దేశాల్లో పర్యటిస్తూ పరిశ్రమలను తీసుకొచ్చేందుకు అహర్నిషలు శ్రమిస్తున్నారని అన్నారు. దీంతో ఏపీలో పరిశ్రమల స్థాపనకు ఉత్సాహం చూపుతున్నారని, ఇందులో భాగంగానే సూళ్లూరుపేట నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటవుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తామని నెలవల చెప్పారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, హరిప్రసాద్, నెలవల సమక్షంలో ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఉయ్యాల ప్రవీణ్

నాయుడుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సంక్షేమమే ధ్యేయంగా నాయుడుపేట మార్కెట్ కమిటీ పాలకవర్గం పనిచేస్తుందని ఏఎంసీ చైర్మన్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. నాయుడుపేట ఏఎంసీ ప్రాంగణంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కె. సాయి సమక్షంలో నాయుడుపేట ఏఎంసీ చైర్మన్‌గా ఉయ్యాల ప్రవీణ్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పార్థసారధి, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, అట్ల కృష్ణారావు, గూడూరు ప్రభావతి, బొమ్మన శ్రీధర్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, దుద్దుశెట్టి సుజయ్‌బాబు, కిలారి గోపీ, గిండి సతీష్, కేశవరెడ్డి, సుజాత, మైలారి రాజశేఖర్, గంగాప్రసాద్, విజయకుమార్‌నాయుడు, జీవీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎవరికి ఇబ్బంది లేకుండా అందరి ఆమోదంతో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో రైల్వే అధికారులు కచ్చేరి వీధిలోని రైల్వేగేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే ఎవరికి ఎటువంటి అభ్యంతరం లేదని స్థానికులు చెప్పారు. సీనియర్ రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బాలమురగన్ మాట్లాడుతూ అండర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, సీఐ మురళీకృష్ణ, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కౌశిక్, స్థానిక నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, ఆదినారాయణ రెడ్డి, సాయిరాం, సాంబశివయ్య, ఏజీ కిషోర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ లిఫ్ట్‌లో ఇరుక్కున్న దంపతులు

అరగంట తరువాత సురక్షితంగా బయటకు

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో దంపతులు లిఫ్ట్‌లో ఇరుక్కున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్లే లోకల్ మెమూ రైలు బుధవారం సాయంత్రం 3:30 గంటలకు సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లోని 1వ నెంబరు ప్లాట్‌ఫారంలో ఆగింది. అందులో నుంచి దిగిన భార్య, భర్త మూడో నెంబరు ప్లాట్‌ఫారంలోకి వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ మధ్యలో ఆగిపోవడంతో ఆందోళనకు గురైన ఆ దంపతులు భయాందోళనకు గురయ్యారు. లిఫ్ట్ లోపల ఉన్న టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయగా రైల్వే టెక్నికల్ సిబ్బంది వచ్చి అరగంట పాటు శ్రమించి మరమ్మతులు డోర్ తెరవడంతో దంపతులు సురక్షితంగా బయటకు వచ్చారు. చెన్నైకి చెందిన వారు షార్ ఉద్యోగుల కాలనీలో బంధువుల ఇంటికి వచ్చినట్లు తెలిసింది.

'అవకాశం ఇస్తే ఎమ్మెల్యే అడుగుజాడల్లో నడుస్తా'

దక్కిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తనకు టీడీపీలో చేరే అవకాశం కల్పిస్తే ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అడుగు జాడల్లో నడుస్తానని ఎంపీపీ గోను రాజశేఖర్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. టీడీపీలో చేరేందుకు అవకాశం ఇస్తే అంకిత భావంతో పనిచేస్తానని చెప్పారు.

జాతీయస్థాయి షూటింగ్ పోటీలకు లక్ష్మీప్రసన్న



లక్ష్మీప్రసన్నను అభినందిస్తున్న కరస్పాండెంట్ కోటేశ్వరరావు

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న లక్ష్మీప్రసన్న జాతీయస్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 షూటింగ్ పోటీల్లో లక్ష్మీప్రసన్న కాంస్య పతకాన్ని గెలుచుకుని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. బుధవారం కళాశాలలో లక్ష్మీప్రసన్నను కరస్పాండెంట్ కోటేశ్వరరావు అభినందించారు.

16న జిల్లాస్థాయి టెన్నికాయిట్ జట్ల ఎంపిక

గూడూరు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఈనెల 16వ తేదీన జిల్లాస్థాయి టెన్నికాయిట్ సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ బుధవారం తెలిపారు.

దుకాణాల్లో తనిఖీలు

30 కిలోల ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల స్వాధీనం

సూళ్లూరుపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాల్లో మున్సిపాలిటీ అధికారులు మంగళవారం దాడులు చేసి 30 కిలోల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో అధికారులు దుకాణాలను తనిఖీ చేసి 120 మైక్రాన్ లోపు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యాపార దుకాణాలు, చికెన్ షాపులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగుల వాడకం నిషేధించాలన్నారు. అదేవిధంగా ప్రజలు ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేయవద్దని, చెత్త బుట్టల్లో వేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు.

పదవులను బాధ్యతగా గుర్తించి పనిచేయండి



ప్రమాణస్వీకార సభలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): పదవులను అలంకారంగా కాకుండా బాధ్యతగా గుర్తించి పనిచేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్ఆర్ఎల్ కళ్యాణ మండపంలో నియోజకవర్గంలో టీడీపీ మండల అధ్యక్షుల ప్రమాణస్వీకారం జరిగింది. వెంకటగిరి పట్టణ అధ్యక్షుడిగా అవ్వారు సత్యనారాయణ, డక్కిలి అధ్యక్షుడిగా పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, బాలాయపల్లి అధ్యక్షుడిగా రాయి సత్యం నాయుడు, రాపూరు అధ్యక్షుడిగా చెన్ను అశోక్‌రెడ్డి, కలువాయి అధ్యక్షుడిగా రఘురామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టకాలంలో జెండా మోసిన ప్రతి నాయకులు, కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. కొత్తగా పదవులు చేపట్టిన నాయకులు యువతకు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరావు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, శ్రీకాళహస్తి ఆలయ బోర్డు సభ్యురాలు రుద్రాక్ష కౌశల్యమ్మ, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, సీసీ నాయుడు, రమణారెడ్డి, మంకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు: విజయశ్రీ



లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేయడానికి ప్రభుత్వ చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం మన్నారుపోలూరులోని పీఎంఏవై, ఎన్టీఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన గృహాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. 279 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ నిరుపేదలకు గృహాల మంజూరులోనూ రాజకీయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులైన వారందరికి గృహాలు మంజూరు చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతున్నామని, ప్రజలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాసరావు, డీఈ దశయ్య ఏఈలు సత్యనారాయణ, శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, నాయకులు మాధవనాయుడు, మునస్వామి, హనుమంతరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి 4 నెలల జైలు

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి కారణమైన మోటారు సైకిలిస్టుకు నాలుగు నెలల జైలు శిక్ష పడింది. రెండేళ్ల క్రితం సూళ్లూరుపేట మండలంలోని వెలగల పొన్నూరు గ్రామానికి చెందిన వేలమూరు పవన్ కుమార్ మోటారు సైకిల్‌పై వెళ్తూ మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరుకు చెందిన గోను మునస్వామిరెడ్డిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో మునస్వామిరెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకుడైన పవన్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో మంగళవారం నిందితుడికి జైలు శిక్ష పడింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి నాలుగు నెలల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సంయుక్త తీర్పు ఇచ్చారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతి కుమార్ వాదించారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల శ్రేయస్సు కోసం అహర్నిశలు పాటుపడుతున్నారని వాకాడు ఏఎంసీ చైర్మన్ మర్రి ప్రమీల, సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కోటలోని తిన్నెలపూడి సహకార సంఘంలో బుధవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్ రెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, ఎంపీటీసీ దారా సురేష్, ఏవో సుచేంద్ర ప్రసాద్, సాయికుమార్ పాల్గొన్నారు.

గ్రామకంఠం కబ్జాపై విచారణ

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి అరుంధతీయవాడలో బుధవారం గ్రామకంఠం భూమి కబ్జాపై అధికారులు విచారణ చేపట్టారు. సర్వే నెంబరు 174లో ఉన్న 3.75 ఎకరాల గ్రామ కంఠం భూమిని స్థానికులు వీధిగా వాడుకుంటున్నారు. ఓ కుటుంబానికి చెందిన వ్యక్తులు ఆ భూమి తమదంటూ ఫెన్సింగ్ రాళ్లు నాటారు. దీంతో గ్రామస్తులు తహసీల్దారు జయజయరావుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దారు వీఆర్వో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి కీర్తన, ట్రైనీ ఎస్ఐ నిఖిల్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది వెళ్లి సంఘటనాస్థలాన్ని పరిశీలించి అది ప్రభుత్వ భూమి అని తేల్చాశారు. వెంటనే ఫెన్సింగ్ రాళ్లను తొలగించాలని కబ్జాదారులను కోరినప్పటికీ వారు అంగీకరించకపోగా అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు ఫెన్సింగ్ రాళ్లను తొలగించారు. గ్రామకంఠం భూమిని కబ్జాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనసేన కార్యాలయం ప్రారంభం



జనసేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఉయ్యాల ప్రవీణ్, హరిప్రసాద్

నాయుడుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయాన్ని నాయుడుపేట పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డులో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, ఇన్‌చార్జి, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ సాయి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో పలువురు జనసేనలో చేరారు. కార్యక్రమంలో కిలారి గోపీ, గిండి సతీష్, బాలుశెట్టి కేశవరెడ్డి, విజయ్, శ్రీను, మహేష్, రోహిణి, నల్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం: కురుగొండ్ల

వెంకటగిరి, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారమవుతోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తిరుపతి రోడ్డులో నిర్మించిన ఎన్టీఆర్ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. ఇళ్లలో పూజలు నిర్వహించి దంపతులకు బట్టలను పెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిషలు కృషి చేస్తున్నారని అన్నారు. ఇళ్ల నిర్మాణాలతో రాష్ట్ర వ్యాప్తంగా పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు కొండా రామచంద్రారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన చిల్లకూరులోని రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరైతుకూ అవసరమైనంత యూరియా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు గోపీ నాయక్, సీఈవో రాజనేని రామయ్య నాయుడు, భవానీ, కిరణ్మయి, మల్లికార్జున్, దాసరి రాము, బెల్లంకొండ రాజేంద్ర, నెల్లూరు రామ్మూర్తి, దనుంజయ, సోమశేఖర్, వినోద్, రవి, శివకుమార్, సురేష్, మల్లికార్జున్‌రెడ్డి, సుబ్బయ్య, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో తనిఖీలు

తడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అక్కంపేట ఆదర్శ పాఠశాలను సమగ్రశిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ గౌరీశంకర్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఉపాధ్యాయుల నుంచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్ధాంతరంగా ఆగిపోయిన బాలికల వసతిగృహ నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య, ఎంఈవో మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, సీఆర్పీ గోపీనాథ్ ఉన్నారు.

రాచపాళెంలో ఉచిత వైద్య శిబిరం

ఓజిలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపాళెంలో బుధవారం నారాయణ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ముప్పాళ్ళ శారదమ్మ, టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఎస్కే ఖలీల్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రాచపాళెంతోపాటు, పెద్దపరియ, పెద్దపరియరాజు పాళెం, చిల్లమానుచేను, పినపరియపాడు, భట్లకనుపూరు గ్రామాలకు చెందిన పలువురికి శిబిరంలో గొంతు, చెవి, ముక్కు, కండ్లు, కీళ్ల సమస్యలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.కృష్ణప్రియ, డాక్టర్ జాహ్నవిప్రియ, డాక్టర్ శరణ్‌కుమార్‌రెడ్డి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మణికంఠన్, క్యాంప్ కోర్డినేటర్ ఎన్.సురేంద్ర కుమార్, బీజేపీ నాయకుడు రవీంద్రరాజు పాల్గొన్నారు.

పాలెంపాడులో పశువైద్యశిబిరం

దొరవారిసత్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పాలెంపాడులో బుధ వారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 85 పశువులకు గర్భకోశ వ్యాధు లకు చికిత్స, 25 పశువులకు సాధారణ చికిత్స అందించి నట్లు పశువైద్యాధికారి శ్రీదేవి తెలిపారు. డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్లు మునిరాజ, గోవర్ధన్, ధనంజయ్య పాల్గొన్నారు.

రాయితీ రుణాల పేరిట రూ.25 లక్షల టోకరా: ఇద్దరి అరెస్టు

నాయుడుపేట టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీఆర్‌డీ సంస్థ పేరిట పేదలకు ఇళ్లు, కార్లు రాయితీతో మంజూరు చేస్తామని నమ్మించి పలువురి నుంచి రూ.25లక్షలు టోకరా పెట్టిన ఇద్దరు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు నాయుడుపేట అర్బన్ సీఐ బాబి తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మీడియాకు వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన మేరకు వివరాలు... బాలయపల్లికి చెందిన గురుప్రసాద్ అలియాస్ ప్రసాద్ రెడ్డి, ఓజిలి మండలం కుందాం గ్రామానికి చెందిన శిల్పప్రియాంక ఏపీఆర్‌డీ పేరిట ఓ సంస్థను ఏర్పాటు చేశారు. ఏజెంట్‌లను నియమించు కుని పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు, కార్లు రాయితీతో అందజేస్తామని పలువురిని నమ్మించారు. ఇందుకోసం ముందుగా డిపాజిట్లు చెల్లించాలంటూ నాయుడుపేట పరిసర ప్రాంతాల్లో రూ.25 లక్షలు వసూలు చేశారు. డబ్బులు కట్టించుకుని ఎన్నాళ్లయినా స్పందించకపోవడంతో నాయుడుపేట మండల ఏపీఆర్‌డీ ఏజెంట్ సాధన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ప్రసాద్‌రెడ్డి, శిల్పప్రియాంకలను అరెస్టు చేసి, వారివద్ద నుంచి అగ్రిమెంట్లు, ప్రామిసరీ నోట్లు, నకిలీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నాయుడుపేట కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



నూతనగృహ ప్రవేశ కార్యక్రమంలో టీడీపీ నేతలు, అధికారులు

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. బుధవారం మండలంలోని చెన్నూరు గ్రామంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి నూతన గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణమూర్తి, అశోక్, శ్రీధర్‌రెడ్డి, శివకుమార్, శ్రీనివాసులురెడ్డి, హౌసింగ్ డీఈ షబ్బీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో రోసనూరు విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెళ్లకూరు, నవంబరు, 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడ, కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో రోసనూరు రాజుపాలెం విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-17 పురుషుల రెజ్లింగ్, జూడో పోటీల్లో పదో తరగతి విద్యార్థి కాగితాల ముత్యాలయ్య రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. అదేవిధంగా అండర్-17 మహిళల రెజ్లింగ్‌లో 9వ తరగతి విద్యార్థి పసల నిరోషా సిల్వర్ పతకం సాధించింది. జూడో పోటీల్లో అండర్ - 17 విభాగంలో మేర్లపాక చరణ్ సిల్వర్ పతకం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థులతో పాటు రెజ్లింగ్ కోచ్ ఉదయ్‌కుమార్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు కృపాల్, రవి, వెంకట్రాయులు, యస్ధాని భాషా, ప్రసాద్, పీఈటీ చంద్రయ్య, చంద్రశేఖర్ అభినందించారు.

పలువురికి ఎమ్మెల్యే పాశిం పరామర్శ

వాకాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ బుధవారం పర్యటించారు. ఇటీవల టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దోశకాయల కృష్ణమూర్తి తల్లి కృష్ణమ్మ మృతి చెందడంతో ఆమెకు నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం వలగనూరు గ్రామంలో ఇటీవల టీడీపీ నేత మోహన్‌రెడ్డి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

అయ్యప్పస్వామికి పడిపూజ

గూడూరు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిలక్‌నగర్‌లోని సీతారామాంజనేయస్వామి క్షేత్రంలో బుధవారం అయ్యప్పస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో స్వామివారికి పడిపూజ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో శ్రీధర్‌నాయుడు, మునీంద్ర, నాగరాజు, శివ, పరంధామయ్య, శరత్‌యాదవ్ పాల్గొన్నారు.



గూడూరులో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, సూళ్లూరుపేటలో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, వెంకటగిరిలో రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకుల ర్యాలీ

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు

గూడూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం సరికాదని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద వైసీపీ ఆధ్వర్యంలో కోట సంతకాల కార్యక్రమం చేప ట్టారు. అక్కడ నుంచి ప్రదర్శనగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, యామిని, మహేంద్రరెడ్డి, శ్రీనివాసులు, నాశిన నాగులు, గిరిబాబు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ నాయకులు ర్యాలీ చేపట్టారు. షార్ రోడ్డులోని డీవోఎస్ కాలనీ ఎదురుగా ఉన్న వైసీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఏవో రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, దీపిక, అలవల సురేష్, మీజూరు రామ కృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, కృపాకర్‌రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌జేఆర్ భవన్ నుంచి తహసీ ల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ నాగమల్లీశ్వరికి వినతిపత్రం అందజేశారు. చిట్టేటి హరికృష్ణ, కల్పలత, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తులసీరెడ్డి, రాధ, కల్యాణి, బాలయ్య, ఉమామహేశ్వరి, లక్ష్మి, చిన్నా, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.